Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 256 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 5 అక్టోబర్ 2023 | గురువారం | పేజీలు : 4

## అరెస్టు చేసేటప్పుడే కారణాలు చెప్పండి

### ఈడీకి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : నిందితులను అరెస్టు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలు ఇచ్చింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఎం3ఎం రియల్ ఎస్టేట్ కంపెనీ నిర్వాహకులు పంకజ్ బన్సల్, పవన్ బన్సల్‌లను తక్షణం విడుదల చేయాలని ఆదేశిస్తూ ఈడీ వ్యవహరించాల్సిన తీరుపై సూచనలు చేసింది. ఈ కేంద్ర దర్యాప్తు సంస్థ వ్యవహార శైలిపై వ్యాఖ్యలు చేసింది. అరెస్టు చేసే సమయంలోనే అందుకుగల కారణాలను లిఖితపూర్వకంగా తెలపకపోవడాన్ని కేసును విచారించిన జస్టిస్ ఎ.ఎస.బోపన్న, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ప్రశ్నించింది. ఇక నుంచి విచారణలో భాగంగానే అరెస్టు కారణాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టం చేసింది.




# అన్ని వర్గాల ఆదరణ పొందేలా

# బీఆర్ఎస్ మేనిఫెస్టో

## త్వరలోనే అన్ని వర్గాలకు శుభవార్త : మంత్రి హరీశ్‌రావు

కొడంగల్ : త్వరలోనే బీఆర్ఎస్ మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ విడుదల చేస్తారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో మహిళలకు శుభవార్త వినిపిస్తాం అని ఆయన పేర్కొన్నారు. కోస్గిలో 50 పడకల ఆస్పత్రిని మంత్రి పట్నం మహేందర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు అమలు చేశారని మంత్రి తెలిపారు. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్, గృహలక్ష్మి ఇలా అనేక పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. త్వరలో బీఆర్ఎస్ మేనిఫెస్టో వస్తుంది. మహిళలను మరింత బలోపేతం చేసే విధంగా ఉంటుంది. మహిళను ఆర్థికంగా బలోపేతం చేసే అంశాలు మేనిఫెస్టోలో ఉంటాయి. త్వరలో శుభవార్త వింటారని మంత్రి స్పష్టం చేశారు. కోస్గి, కొడంగల్‌లో ఒకప్పుడు మంచి నీటి కష్టాలుండేవి.. మూడొద్దులకు ఒకసారి నీళు వచ్చేవని హరీశ్‌రావు గుర్తు చేశారు. ట్యాంకర్ల వెంట నీళ్ల కోసం పరుగెత్తేవారు. గతంలో బోరింగ్‌లు కొట్టి, నీల్లు మోసి ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఇంటింటికీ నల్లా పెట్టి నీళ్లు అందిస్తున్నాం. కొడంగల్ ఆడబిడ్డల కష్టాలు తీర్చారు సీఎం కేసీఆర్. రేవంత్ రెడ్డి గెలిచి ఉంటే మరో 10 ఏండ్లు అయినా మంచినీళ్లు రాకపోయేవి. మీ పక్కనే కర్ణాటక ఉంది. అక్కడ కల్యాణ లక్ష్మి ఉందా. 12 లక్షల పెళ్లిళ్లకు రూ. 11 వేల కోట్లు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానాకు అనేటోళు. ఇప్పుడు కేసీఆర్ నాయకత్వంలో పోదాం పదా బిడ్డ సర్కార్ దవాఖానాకు అనే అంత గొప్పగా ఆస్పత్రులను అభివృద్ధి చేశాం. పైసా ఖర్చు లేకుండా కాన్పు చేసి కేసీఆర్ కిట్ అందిస్తున్నాం. కాంగ్రెస్ గవర్నమెంట్ ఈ పని చేసిందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

**ఎవరెన్ని జిమ్మిక్కులు, ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ సీఎం మన కేసీఆరే** : ఎవరెన్ని జిమ్మిక్కులు, ట్రిక్కులు చేసినా.. బీజేపీ లేచేది లేదు.. కాంగ్రెస్ గెలిచేది లేదు.. గెలిచేది.. హ్యాట్రిక్ సీఎం మన కేసీఆరే అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

అందులో ఎవరికి అనుమానం లేదు. ఇవాళ రాష్ట్రంలో ఎవర్నీ అడిగినా, ఏ సర్వే చూసినా గులాబీ జెండా, కేసీఆర్ గెలుస్తరని అంటున్నారని హరీశ్‌రావు తెలిపారు. కోస్గిలో 50 పడకల ఆస్పత్రిని మంత్రి పట్నం మహేందర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. గ్యారెంటీగా గెలిచేది మనమే.. వచ్చేది మనమే అని మంత్రి స్పష్టం చేశారు. ఒకప్పుడు కొడంగల్ ప్రాంతం వెనుకబడ్డ ప్రాంతం. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తెచ్చే పనిలో కేసీఆర్ ఉన్నారు. ఆ పని జరగాలంటే కేసీఆర్‌ను దీవించాలి. డబ్బులు పంచి గెలవాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇదే రేవంత్ రెడ్డి టీడీపీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు యత్నించి, ఓటుకు నోటు కేసులో జైలుకు పోయి వచ్చిండు. రేవంత్ రెడ్డి మీద చర్య తీసుకోవాలని, విచారణ జరపాలని సుప్రీంకోర్టు నిన్న తీర్పు ఇచ్చింది. న్యాయం గెలుస్తది.. ధర్మం నిలబడతది. రేవంత్ తప్పు చేశాడు.. కోర్టులో విచారించాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆయనపై విచారణ అయ్యేది ఖాయం.. జైలుకు పోయేది కూడా ఖాయం. కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మి ఆగం కావొద్దు అని హరీశ్‌రావు కోరారు.

**కొడంగల్‌కు వచ్చేందుకు రేవంత్ యత్నం..** 24 గంటల కరెంట్ దండగ అని రేవంత్ రెడ్డి అంటున్నాడని మంత్రి గుర్తు చేశారు. మూడు గంటల కరెంట్ ఇస్తే చాలని అంటున్నాడు. వ్యవసాయం చేస్తే అర్థమైతది కరెంట్ కష్టాలు. పాలమూరు నీళ్లు రావాలంటే పట్నం నరేందర్ రెడ్డి మళ్లీ గెలవాలి. మల్కాజ్‌గిరిలో రేవంత్ ఏం పని చేయాలే. అక్కడ ఓడిపోయే అవకాశం ఉంది కాబట్టి.. మళ్లీ రేవంత్ రెడ్డి కొడంగల్ వచ్చేందుకు యత్నిస్తున్నాడు. కాబట్టి మనం మోసపోతే గోసపడుతాం అని హరీశ్‌రావు హెచ్చరించారు. నారాయణపేటలో మెడికల్ కాలేజీ ప్రారంభించబోతున్నాం అని మంత్రి తెలిపారు. ఈ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుకు పోతుంది. పొరుగున ఉన్న కర్ణాటకలో రైతులకు ఆరేడు గంటల కరెంట్ కూడా వస్తలేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మనం 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. సాగుకు సరిపడా నీళ్లు ఇస్తున్నాం. కాబట్టి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దీవిస్తే కృష్ణా జలాలు తీసుకొచ్చి మీ పాదాలను కడుగుతాం. బీఆర్ఎస్ మేనిఫెస్టో త్వరలోనే వస్తుంది. మహిళలు శుభవార్త వింటారు అని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.



## ఢిల్లీ లిక్కర్ స్కాంపై సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాంపై సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈ లిక్కర్ స్కాంలో సిసోడియాను మాత్రమే ఎందుకు అరెస్ట్ చేశారు? లిక్కర్ స్కాంలో ఉన్న వైసీపీ, బీఆర్ఎస్ నేతలు సేఫ్‌గా బయట ఉన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలది అండర్ స్టాండింగ్‌తో కూడిన ముద్దులాట, గుద్దులాట మాత్రమే. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జైలుకు వెళ్లలేదంటే.. బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటి కాబట్టే వెళ్లలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు దిగజారుడు తనానికి పరాకాష్ఠ. సీఎం కేసీఆర్ ఆఫ్ ది రికార్డ్ మాటలను ప్రధాని మోదీ బయట పెట్టడం అనైతికం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటి కాదని చెప్పేందుకే మోదీ తాపత్రయం పడుతున్నారు. ప్రధాని స్థాయి వ్యక్తి దేశానికి అవమానకరంగా మాట్లాడారు. కేసీఆర్ అవినీతిపై మోదీ సర్కార్ ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. జాతీయస్థాయి తరహాలోనే తెలంగాణలోనూ కాంగ్రెస్ లెఫ్ట్ పార్టీలు కలిస్తే బాగుంటుంది. ఏపీలోనూ టీడీపీ, జనసేనతో కలసి పనిచేసే అంశాన్ని పరిశీలిస్తాం" అని సీపీఐ నారాయణ పేర్కొన్నారు.




### గ్యాస్ ధర తగ్గింపు, తెలంగాణకు ఇచ్చిన హామీలకు గ్రీన్‌సిగ్నల్.. కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు..

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశం అయింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కేబినెట్ అంశాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

**కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవే...** నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం. తెలుగురాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం తీర్మానం. రూ. 889 కోట్లతో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యునివర్సిటీ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఎల్‌పీజీ సిలిండర్‌పై మరో రూ.100 సబ్సిడీ పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే ఇటీవల తగ్గించిన రూ.200 తో కలిపి మొత్తం ఇప్పుడు రూ. 300 మేర ఉపశమనం కల్పించినట్టయ్యింది.



## 13 నుంచి స్కూళ్లకు బతుకమ్మ, దసరా సెలవులు

హైదరాబాద్: తెలంగాణలో విద్యాసంస్థలకు బతుకమ్మ, దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 13 నుంచి బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. 13 నుంచి 25 వరకు అంటే 13 రోజుల పాటు బడులకు సెలవులు ఉంటాయని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని రకాల స్కూళు ఈ సెలవులను పాటించాలని విద్యాశాఖ సూచించింది. ఇంటర్మీడియట్ కాలేజీలు మాత్రం 19 నుంచి 25 వరకు సెలవులు ఇవ్వాలని పేర్కొంది. మరోవైపు తెలంగాణలో అక్టోబర్ 6 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం కానుంది. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.




# కరెంట్ గురించి మాట్లాడడానికి కాంగ్రెసోళ్లకు

# ఇజ్జత్ ఉండాలె

## తెలంగాణ కాంగ్రెస్‌పై మంత్రి కేటీఆర్ నిప్పులు

### లక్ష్మీ నర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్

నిర్మల్ : కరెంట్ గురించి మాట్లాడడానికి కాంగ్రెస్ నాయకులకు ఇజ్జత్ ఉండాలె అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని మంత్రి స్పష్టం చేశారు. నిర్మల్ పట్టణంలో వందల కోట్ల రూపాయాలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. దివాలాపూర్ మండలంలో రూ. 714 కోట్లతో నిర్మించిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఎత్తిపోతలకు ప్రారంభించుకున్నాం అని కేటీఆర్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నాం. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో రూ. 300 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపనం చేశాం. ఈ ఫ్యాక్టరీలో 300 మందికి ప్రత్యక్షంగా, మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. నిర్మల్ పట్టణంలో వందల కోట్ల రూపాయాలతో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకున్నాం అని మంత్రి తెలిపారు. రెండు సార్లు కేసీఆర్‌ను ఆశీర్వదించి, ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని నడుపమని అవకాశం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. మళ్లీ ఎలక్షన్లు వస్తున్నాయి. ఈ తొమ్మిదినరేండ్లలో ఏం చేశామో.. మళ్లా ఎందుకు ఓటేయాలని కోరుతున్నామో.. చెప్పడానికి వచ్చాం. మేం చేసింది, చెప్పింది నిజమైతే కడుపు నిండా ఓట్లు వేయండి. ఒక వేళ మేం చెప్పింది తప్పయితే ఓట్లు వేయకండి. 2014లో కరెంట్, తాగు, సాగునీటి పరిస్థితి ఎట్ల ఉండే. ఇప్పుడు ఎట్ల ఉందో ఆలోచించి ఓటేయండి. నిర్మల్ పట్టణం అభివృద్ధి చెందింది. 2014కు ముందు ఏదైనా కష్టమొస్తే.. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారుల దగ్గరకు వెళ్లాలంటే 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా నిర్మల్‌లోనే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించుకున్నాం. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులందరూ ఇక్కడకు వచ్చారు. మన కలెక్టరేట్లు ఉన్నట్లు.. ఇతర రాష్ట్రాల్లో సెక్రటేరియట్లు కూడా లేవు అని కేటీఆర్ తెలిపారు. 2014కు ముందు తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఉండేవని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాకముందు ఎండాకాలం వచ్చిందంటే సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యేలకు భయం. ఎక్కడ కుండలు, బిందెలు అడ్డం పెడుతారో అనే భయం ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నాం.

పదేండ్ల కింద 10 గంటలు కరెంట్ పోతే అడిగినోళ్లు లేరు. ఇప్పుడు 10 నిమిషాలు కరెంట్ పోతే ఆగమైపోతున్నారు. ఒక్కటే గుర్తు చేస్తున్నా. 28 రాష్ట్రాల్లో రైతులకు 24 గంటలు ఉచితంగా కరెంట్ ఇవ్వడం లేదు. కేవలం కేసీఆర్ మాత్రమే ఉచిత కరెంట్ ఇస్తున్నారు. ఎక్కడ ఉన్నది కరెంట్ మాకు కనబడుతలేదు అని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. నిర్మల్ జిల్లాలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు బస్సులు ఏర్పాటు చేస్తాం. ఏ ఊరికి పోతరో పోండి. ఏ టైంకు పోతరో పోండి. వరుసగా నిలబడి గట్టిగా కరెంట్ తీగలను పట్టుకోండి.. కరెంట్ వస్తుందో లేదో తేలిపోతది. రాష్ట్రానికి కూడా దరిద్ర్యం వదిలిపోతది. మాట్లాడానికి సిగ్గు శరం ఉండాలి. 2014కు పూర్వం కరెంట్ సమస్యలు ఉండేవి. కరెంట్ గురించి మాట్లాడటానికి కాంగ్రెస్ నాయకులకు ఇజ్జత్ ఉండాలె. రోజుకు 6 గంటల కరెంటని చెప్పి.. ఏనాడూ ఆరు గంటలు ఇవ్వలేదు. మూడు గంటలు ఒకసారి, మరోసారి మూడు గంటల కరెంట్ ఇచ్చేవారు. ఎరువులు, విత్తనాల కోసం పోలీసు స్టేషన్లు, దుకాణాల ముందు చెప్పుల లైన్లు దర్శనమిచ్చేవి. ఇవాళ కడుపు నిండా కరెంట్ ఇస్తున్నారు కేసీఆర్. నేను చెప్పేది వాస్తవమైతే మాకు ఓటేయండి.. తప్పయితే మీకు ఇష్టమున్నట్లు ఓటు వేసుకోండి అని కేటీఆర్ సూచించారు.

# సంపాదకీయం

## కొత్త వైరస్ "డిసీజ్ ఎక్స్" 5 కోట్ల మంది చనిపోతారంట!

కరోనా... ఈ పేరు చెబితే ప్రపంచం మొత్తం ఒక్కసారిగా వణికిపోద్ది అన్నా అతిశయోక్తి కాదు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ వైరస్ ప్రపంచాన్ని వణికించేసింది. లక్షల కుటుంబాలు ఈ వైరస్ వల్ల రోడ్డున పడిపోయాయి. ఆ వైరస్ మిగిల్చిన గాయాలు ఇంకా మానలేదంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో తాజాగా కరోనా కంటే 7 రెట్లు ప్రమాదకరమైన మరోవైరస్ తో మానవాళికి పెను ముప్పు ఉందని చెబుతుంది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ)! అవును... పేండమిక్ అని అంటే ప్రతి ఒక్కరి మనస్సులో మొదటిగా గుర్తు వచ్చేది కరోనా! ఇది ప్రపంచంలో అతిపెద్ద విధ్వంసానికి కారణమైంది. లక్షలాది మంది మరణానికి కారణమైంది. భయంతో చాలా చోట్ల లాక్ డౌన్ లాంటి పరిస్థితి ఏర్పడింది. 2020 సంవత్సరంలో సంభవించిన కరోనా మహమ్మారి ఇప్పటి వరకు అత్యంత ప్రమాదకరమైన అంటువ్యాధిగా రికార్డులకెక్కింది. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో కరోనా కంటే 7 రెట్లు ప్రమాదకరమైన అంటువ్యాధిని ఎదుర్కోవలసి ఉంటుందని తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మరోసారి అత్యంత ప్రమాదకరమైన వ్యాధి ముప్పు పొంచి ఉందని చెప్తూ... దీనికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక జారీ చేసింది. ఈ కొత్త వ్యాధికి "డిసీజ్ ఎక్స్" అని పేరు పెట్టారు. డబ్ల్యూ.హెచ్.ఓ అంచనాల ప్రకారం.. ఈ వ్యాధి కారణంగా సుమారు ఐదు కోట్ల మంది మరణించే అవకాశం ఉందట. దాన్ని బట్టి ఈ అంటు వ్యాది తీవ్రత ఏ రేంజ్ లో ఉండొచ్చో అర్థం చేసుకోవచ్చు. కాగా... కోవిడ్-19 వంటి మహమ్మారి 2020 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీంతో సుమారు 70 లక్షల మంది మరణించారు. భారతదేశంతో సహా అనేక దేశాల్లో ప్రజలు ఇప్పటికీ ఈ మహమ్మారి ఎఫెక్ట్ ని చవి చూస్తున్నారని అంటున్నారు. ఈ సమయంలో నిపుణులు కొత్త అంటువ్యాధి రాకగురించి చెబుతున్నారు. ఇది కోవిడ్ -19 కంటే ఏడు రెట్లు ఎక్కువ ప్రమాదకరం అని అంటున్నారు. ఈ కొత్త మహమ్మారి వల్ల దాదాపు 5 కోట్ల మంది చనిపోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త మహమ్మారి 1918-1920లో వచ్చిన వినాశకరమైన స్పానిష్ ఫ్లూ అంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యార్డు వెలుపల కాయల సేకరణ వద్దు



జగిత్యాల : జగిత్యాల వ్యవసాయ మార్కెట్యార్డు ఆధ్వర్యంలోని చల్‌గల్‌లోని మామిడి మండీ పరిధిలో ఈ సీజనులో పలువురు వ్యాపారులు మామిడి కాయల కొనుగోలును యార్డు వెలుపలగల షెడ్లలో ప్రారంభించారు. మామిడి మార్కెట్లో రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నాలుగు భారీ షెడ్లు అందుబాటులోకి రావటం, చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి తీసుకున్న అదనపు 10 ఎకరాల స్థలంలోనూ మామిడి కాయల క్రయవిక్రయాలను చేపట్టనుండటంతో ఈ సీజనులో వ్యాపారులందరూ యార్డులోకి రావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గతంలో మాదిరిగా యార్డు వెలుపల తమ సొంత స్థలాలు, ప్రైవేటు అద్దెస్థలాల్లో కొనుగోళ్లు జరపవద్దని, వ్యాపారులందరూ తప్పనిసరిగా యార్డులోనే ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు ఉత్తర్వులు, వ్యాపారులకు నోటీసులు జారీచేశారు. ఇందుకు అనుగుణంగా గత సీజన్‌లో మార్కెట్ఫీజు చెల్లించిన వ్యాపారులకు వరుసక్రమంలో మార్కెట్లోని షెడ్లలో స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రైవేటు స్థలాల్లో కాయల కొనుగోలును ప్రారంభించగా మరికొందరు కూడా సొంత స్థలాల్లోనే కొనుగోలుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారి వెంబడి ప్రైవేటు షెడ్లుండటం, గతంలో రహదారి ప్రమాదాలు జరిగి కొందరు కార్మికులు మృత్యువాత పడటంతో తప్పనిసరిగా వ్యాపారులందరూ మండీలోకే రావాలని నిర్దేశించారు. సీజన్‌లో దాదాపుగా 5 వేలమంది వరకు కార్మికులు వివిధ రాష్ట్రాల నుంచి కాయల గ్రేడింగ్, ప్యాకింగ్, లోడింగ్ తదితరాలకు వస్తారు, వీరంతా యార్డులోనే బసచేస్తారు. కాయల తరలింపునకు వేలాది వాహనాలు వస్తాయి కాబట్టి ఈ వాహనాలన్నీ రోడ్డుపక్కనే రోజుల తరబడి పార్కింగ్ చేయటంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మరోవైపు ప్రైవేటు స్థలాల్లో కొనుగోళ్లు జరిపితే మార్కెటింగ్ అధికారుల ఆజమాయిషీ కొరవడుతుంది, మార్కెట్ ఫీజు తగ్గుతుంది. తూకం, ధరల నిర్ణయం రైతులకు చెల్లింపు తదితరాల్లోనూ ఇబ్బందులు తలెత్తుతాయి. మరోవైపు కమీషన్ లైసెన్స్‌గల వ్యాపారులు కాబట్టి ఈ సీజన్‌నుంచి బహిరంగ వేలం పద్ధతిన కాయలను కొనాలని యోచిస్తుండటంతో అందరూ యార్డులోకి వస్తేనే వేలం సాధ్యపడుతుంది. ఈ నేపథ్యంలో మరో వారం రోజుల్లో కాయల కొనుగోళ్లు పెరిగే అవకాశమున్నందున మామిడి మండీలోనే మామిడి కాయల లావాదేవీలు జరిపేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ వ్యాపారులతో మాట్లాడి జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తామని వివరించారు.

## పెరిగిన ఉపాధి కూలీ



కరీంనగర్ : ఉపాధి హామీ పథకం పనులకు దినసరి కూలీ రేట్లను కేంద్ర ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా కూలీలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు కూలీలకు రూ.257 చెల్లిస్తుండగా, ఏప్రిల్ 1 నుంచి రూ.272 అందించనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లా పరిధిలోని 5,01,534 కుటుంబాలు ఉండగా 9,37,073 కూలీలు ఉన్నారు. ఇందులో 3,44,344 యాక్టీవ్ జాబ్‌కార్డులు ఉండగా, 5,24,372 మంది కూలీలు ఉన్నారు. ఆయా కూలీల ఒక ఒక్కొక్కరికి రూ.15 చొప్పున అదనంగా రానున్నాయి. ఏటా మార్చి నుంచి జూన్ వరకు వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో కూలీల సంఖ్య పెరుగుతుంది. దీని ద్వారా ఏప్రిల్ 1 నుంచి పెరగనున్న దినసరి కూలీతో ఎంతగా ఆర్థికంగా లాభం చేకూరనుంది.

మారిన విధానంతో తగ్గిన కూలీలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) విధానంతో ఇబ్బందిగా మారి కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గతేడాది ఉమ్మడి జిల్లాలో మార్చి 31 వరకు 27,635 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకుంటే ప్రస్తుతం కేవలం 3,565(ఈనెల 25 వరకు) మాత్రమే పూర్తి చేయగలిగారు. జగిత్యాల జిల్లాలో గతేడాది 7,567 కుటుంబాలు వంద రోజులు పూరి చేసుకోగా ప్రస్తుతం 604, కరీంనగర్‌లో 7వేలు కాగా, 1,483, పెద్దపల్లి జిల్లాలో 5,475కి ప్రస్తుతం 606, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 7,593 పూర్తి చేసుకుంటే ఈ ఏడాది కేవలం 872 కుటుంబాలు పూర్తి చేసుకున్నాయి. గతంలో కూలీలు పనిచేసిన తర్వాత పనుల కొలతలను వారం రోజుల తరువాత ఫొటోలు తీసుకునే వారు. ప్రస్తుత విధానం అలా కాకుండా ప్రతి రోజు రెండు సార్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం వేసవి కావడంతో ఉదయం వచ్చిన కూలీలు వారి కొలతల ప్రకారం పనులు చేసుకుని వెళుతున్నారు. దీనివల్ల ఉదయం తీసుకున్నప్పటికీ మధ్యాహ్నం సమయం మళ్లీ కూలీలు పనుల వద్దకు వెళ్లి వారి తీసుకోవడం కష్టంగా మారింది. ఒక్క పనిని రెండేసి మార్లు తీయడం ఇబ్బందిగా మారిందని ఉపాధి సిబ్బంది పేర్కొంటున్నారు.

## ఆఖరి నిమిషంలో సద్వినియోగం ఎలా?



జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. పాఠశాల సముదాయ (స్కూల్ కాంప్లెక్స్), మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)ల నిర్వహణకు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏటా విడతల వారీగా నిధులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడతలో సగం కంటే ఎక్కువ నిధులు విడుదల చేశారు. వార్షిక ఏడాది ముగింపు దశలో రెండో విడత వాటా జమ అయ్యాయి. ఈ నెలా ఖరులోపు ఖర్చు చేయకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోనున్నాయి. కార్యాలయ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎమ్మార్సీలకు నిధులు మంజూరు చేశారనే ఊరట ఆందోళన కలిగిస్తోంది. ఆఖరి నిమిషంలో ఎలా ఖర్చు చేయాలనే అయోమయం నెలకొంది.

నిర్వహణకు ఆర్థిక చేయూత విద్యాభివృద్ధిలో ఎమ్మార్సీలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. మండలాల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు పాఠశాలల వారీగా సేకరిస్తున్న పలు రకాల సమాచారాన్ని ఎమ్మార్సీల పరిధిలో పర్యవేక్షిస్తున్నారు. కార్యాలయ సామగ్రి, విద్యుత్తు బిల్లులు, సమావేశాలు, కంప్యూటర్ల నిర్వహణ ఇతరత్ర అవసరాలకు విద్యాశాఖ గ్రాంట్లను మంజూరు చేస్తోంది. ఈ నిధులతో ఆర్థిక సమస్యలు తీరుతున్నాయి. నిధుల ఖర్చులో పారదర్శకత పాటిస్తున్నారు. ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాకు రూ.39.48 లక్షలు

ఉమ్మడి జిల్లాలో

47 ఎమ్మార్సీలు ఉన్నాయి. ఒక్కో ఎమ్మార్సీకి ఏటా రూ.84 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాదిలో తొలి విడతలో రూ.45 వేలు, ప్రస్తుతం రెండో విడతలో రూ.39 వేలు జమ చేశారు. ఉమ్మడి జిల్లాలో తొలిసారి రూ.21.15 లక్షలు, రెండోసారి రూ.18.33 లక్షలు మొత్తం రూ.39.48 లక్షలు మంజూర య్యాయి. మార్చిలోపు నిధులు ఖర్చు చేయాలని ఆదేశించడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూడు రోజుల గడువు మిగిలి ఉండటంతో ఎలా ఖర్చు చేస్తామని ప్రశ్నిస్తున్నారు.

## దుస్తుల కుట్టుకూలీ రూ. 1.31 కోట్లు విడుదల

నల్గొండ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసిన ఏకరూప దుస్తుల కుట్టు కూలీ విడుదలైంది. నల్గొండ జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో ఏక రూప వస్త్రాలు కుట్టిన వారికి నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2022-23లో జిల్లాలో 1,31,543 మంది విద్యార్థులకు ఏక రూప దుస్తులు కుట్టించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున మొత్తం 2,63,086 దుస్తులు కుట్టించారు. ఒక్కో డ్రెస్‌కు కుట్టు కూలి కింద రూ.50గా నిర్ణయించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మొదట ఒక జతను ఆగస్టులో, మరో జతను సెప్టెంబర్‌లో అందచేశా




రు. మొత్తం కుట్టు కూలి కింద రూ.1,31,54,300 చెల్లించాల్సి ఉంది. కుట్టిన వారికి ఒక్క రూపాయి విడుదల కాకపోవడంతో ఆందోళన చెందారు. మళ్లీ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి నుంచే దుస్తులు కుట్టాల్సి ఉంది. కొత్తవి కుట్టాల్సి రావడం, పాత వాటికి డబ్బులు ఇవ్వకుంటే కుట్టే వారు ముందుకు రారన్న ఉద్దేశంతో ప్రభుత్వం కుట్టు కూలి నిధులు విడుదల చేసిందని భావిస్తున్నారు. మొత్తం మీద యూనిఫాం దుస్తులు కుట్టిన డబ్బులు విడుదల చేసినందుకు దర్జీలు, కుట్టిన సంఘాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన కుట్టు కూలి గ్రాంట్ నిధులను సంబంధిత పాఠశాల యాజమాన్య కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. యూనిఫాంలు కుట్టిన వారు సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకుని వారి ద్వారా రావాల్సిన డబ్బులను బ్యాంకు ఖాతా ద్వారా పొందాలని సూచించారు.

## ఆహార భద్రతకు నిరీక్షణే!

సూర్యాపేట : పట్టణ వాసి మణి మూడేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. రేషన్ కార్డు కోసం 2019లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రేషన్ కార్డు మంజూరు కాలేదు. తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మునగాలకు చెందిన నగేశ్‌కు 2020లో పెళ్లి అయింది. కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు వారి తల్లిదండ్రుల కార్డులో నుంచి ఆయన పేరు తొలగించారు. నూతన జంట రేషన్ కార్డుకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేటి వరకు కార్డు రాకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అమలు కావాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. నిత్యావసర సరకుల నుంచి ప్రస్తుతం ఇస్తున్న రెండు పడక గదుల ఇళ్ల వరకు రేషన్‌కార్డు తప్పనిసరి. కానీ ఈ కార్డు మంజూరులో ప్రభుత్వ అలసత్వం వల్ల నిరుపేదలు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ఆహార భద్రత కార్డుల్లో పేర్ల నమోదు, కొత్తవి జారీ కోసం పాత కార్డుల్లో పేర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకున్నా. ఫలితం లేకుండా పోతోంది. గతేడాది కొత్త కార్డులను పంపిణీ చేసినా పేర్లు మార్పిడి దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

జిల్లా వ్యాప్తంగా పేర్ల మార్పిడికి సంబంధించి వివిధ కారణాలతో సుమారు 24,740 దరఖాస్తుల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి డీఎస్‌వో, తహసీల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. కాగా కొత్త రేషన్ కార్డుల కోసం 13,467 దరఖాస్తులు రాగా గత ఏడాది 8,753 మంజూరు చేశారు. 2,760 వరకు దరఖాస్తులు తిరస్కరించారు. 478 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటిపై సర్వే జరిపి వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

పథకాలకు దూరం

రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో అర్హులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఏళ్ల తరబడి రేషన్ సరకులు పొందలేకపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా,. వ్యాధులు వచ్చినా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చూపించుకునేందుకు ఆరోగ్యశ్రీ కార్డు వర్తించడం లేదు. దీంతో వారు కార్పొరేట్ వైద్యానికి దూరం అవుతున్నారు. విద్యార్థులు ఉపకార వేతనాలకు కూడా దూరం అవుతున్నారు. రూ.వేల ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి దరఖాస్తులను పరిష్కరించేలా చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిపుల్లయ్య, డీఎస్‌వో, సూర్యాపేట

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్నా... పేర్లు మార్పిడి చేయాలన్నా ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. రాగానే వెంటనే పరిష్కరిస్తాం.

## ఎదుర్కొనే ధైర్యం లేక కుట్ర

సూర్యాపేట : రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం పార్లమెంట్ చరిత్రలో చీకటి దినమని, ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యత్వం రద్దుకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చేపట్టిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీని ఎదుర్కొనే ధైర్యం లేకనే ఆయనపై కుట్ర చేసి అనర్హత వేటు వేశారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను అణచివేసే దోరణిగా వ్యవహరించడం సరికాదని ఆరోపించారు. ఎన్ని కేసులు వేసినా, ఎంత మంది ఇబ్బంది పెట్టినా వెనకడుగు వేయని నాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్ అలీ, కోతి గోపాల్, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మానేరు కాల్వలపై వంతెనలు శిథిలం

ముస్తాబాద్: ఎగువ మానేరు జలాశయం కాల్వలపై వంతెనలు నిర్మించి ఏళ్లు గడుస్తుంది. గతంలో నిర్మించినవి కొన్ని చోట్ల రోడ్డు మరమ్మతుల దృష్ట్యా రహదారికి సమాంతరంగా మారాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరుకొన్నాయి. వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో కొన్నిచోట్ల కూలిపోయాయి. రహదారికి సమాంతరంగా మారడంతో అదుపు తప్పి వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అయినా స్పందించిన నాథుడు కనిపించడం లేదు. ఎగువ మానేరు కాల్వలపై రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారిన వంతెనలపై ప్రత్యేక కథనం.

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి పోత్గల్ వెళ్లే ప్రధాన రోడ్డులో ఎగువ మానేరు కాల్వపై రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. నిత్యం మండల కేంద్రం నుంచి పోత్గల్, గన్నెవారిపల్లె, సేవాలాల్‌తండా గ్రామాలకు, గ్రామాల నుంచి మండల కేంద్రానికి వాహనదారులు వివిధ పనులపై వస్తూ పోతూ ఉంటారు. అలాగే ఆర్టీసీ బస్సులు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటాయి. ఏడాది క్రితం రాత్రి వేళలో ఓ కారు వంతెనను ఢీకొట్టగా రక్షణ గోడ కూలిపోయింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మరోవైపు రోడ్డుకు సమాంతరంగా రక్షణ గోడ ఉంది. దూరం నుంచి వచ్చే వాహనదారులకు వంతెన వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

రాంరెడ్డిపల్లె వెళ్లే దారిలో..

మండల కేంద్రం నుంచి నామాపూర్ శివారు మీదుగా రాంరెడ్డిపల్లె, కొండాపూర్ గ్రామాలకు నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వస్తూ పోతూ ఉంటారు. ఎగువ మానేరు కాల్వపై మలుపు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. దీనికి రక్షణ గోడలు సమాంతరంగా ఉన్నాయి. పైగా వాటి చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. అసలే మలుపులు కావడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఏళ్ల తరబడి ఇక్కట్లే

ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా పరిధిలోని రాగంవాడలో కాల్వకు ఓవైపు 12 కుటుంబాలు నివాసం ఉండగా, మరోవైపు 13 కుటుంబాలు ఉంటున్నాయి. కాల్వపైన సీసీ రోడ్డు వేసి దాదాపు అయిదేళ్లు అవుతుంది. అప్పటి నుంచి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకుండా వదిలేశారు. అక్కడ నివసించే రైతు కుటుంబాలు అటువైపు నుంచి ఇటువైపు వచ్చి వెళ్లే క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

చెట్ల మధ్యలో...ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి చిప్పపల్లి మీదుగా గోపాల్‌పల్లె రోడ్డు మధ్యలో ఎగువ మానేరు కాల్వ వంతెన ఇరుకుగా ఉంది. ఇది రహదారికి సమాంతరంగా మారి వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. నిత్యం మండల కేంద్రం నుంచి చిప్పలపల్లి మీదుగా గోపాల్‌పల్లె, కొండాపూర్ గ్రామాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రం నుంచి బస్సు ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, కొండాపూర్ మీదుగా మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంది. అలాగే వాహనదారులు ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళలో ఈ మార్గంలో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు పరిశీలించి కాల్వపై రక్షణ గోడలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అడ్డుగోడలు లేక...

ముస్తాబాద్ మండలంలోని పలు చోట్ల ఎగువ మానేరు కాల్వలపై ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు సమాంతరంగా మారాయి. దీంతో నిత్యం ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రాత్రి వేళలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అధికారులు ఎగువ మానేరు కాల్వలపై ప్రమాదకర వంతెనలను తొలగించి కొత్తవి నిర్మించాలి.

పారిపల్లి శ్రీనివాస్, పోత్గల్

మరమ్మతులకు ప్రణాళిక రూపొందించాం

ఇప్పటికే ఎగువ మానేరు కాల్వలపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులను గుర్తించాం. మరమ్మతుల కోసం ప్రణాళికలు రూపొందించాం. ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే రక్షణ గోడలు నిర్మించేందుకు చర్యలు చేపడతాం. అంతవరకు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుపై చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.వంశీకృష్ణ, నీటిపారుదలశాఖ ఏఈ

# చెరువులు నిండేనా.. పంటలు పండేనా..!

గుర్రంపోడు : ఈ ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావంతో ఏఎమ్మార్పీ ఆయకట్టులో కనీసం చెరువులు నిండే పరిస్థితి కనిపించటం లేదు. జిల్లాలో వర్షాలు తక్కువ కురిసిన ప్రతి సారి నాగార్జునసాగర్ జలాశయంలో కొద్దిపాటి నీరున్నా ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలోని చెరువులు మాత్రం నిండేవి. దీంతో ఎంతో కొంత పంటలు సాగై రైతులకు కనీసం ఉపాధి లభించేది. కాని ఈ సారి స్థానికంగా వర్షాలు లేకపోగా కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలోనూ వర్షాలు లేక జలాశయంలోకి కనీసం నీటి మట్టం కూడా రాలేదు. ప్రస్తుతం ఉన్న అతికొద్ది నీటిని తాగు నీటి అవసరాలకు మాత్రమే అధికారులు వినియోగిస్తున్నారు. ఆదివారం నాటికి నాగార్జునసాగర్ నీటి మట్టం 525.00 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న 158.550 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తే మరో నాలుగు నెలల పాటు సరిపోతాయంటున్నారు.

200 చెరువులకు పైగా..నీటి పారుదల శాఖ గుర్రంపోడు డివిజన్ పరిధిలోని గుర్రంపోడు మండలంలో 61 కుంటలు ఉండగా కనగల్ మండలంలో 40 చెరువులు కుంటలు ఏఎమ్మార్పీ ఆయకట్టు కింద ఉన్నాయి. ఇంకా పెద్దవూర, పీఏపల్లి, తిప్పర్తి, కట్టంగూరు మండలాల పరిధిలో మరో 100 కుంటలు పైగా ఉన్నాయి. గుర్రంపోడు డివిజన్ పరిధిలోని గుర్రంపోడు, కనగల్, నల్గొండ మండలాల పరిధిలోని 101 చెరువుల కింద 6116 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇవి కాక మిగతా మండలాల్లో ఐదు వేల ఎకరాల ఆయకట్టు ప్రత్యక్షంగా సాగులో ఉంది. వీటి కింద పూర్తిగా వరి సాగు చేసేవారు. ఈ సారి చెరువుల కింద నార్లు పోసుకున్న రైతులు ఇప్పటికీ చెరువుల్లోకి నీళ్లు వస్తాయని ఎదురు చూస్తున్నారు.

తుఫాను ప్రభావంపైనే ఆశలు

ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫానులు వస్తుంటాయి. ఈ సారి కూడా అలాంటి తుఫాను వస్తేనే చెరువుల్లోకి నీళ్లు చేరే అవకాశాలున్నాయి. ప్రస్తుతం చెరువుల కింద వేసుకున్న పంటలూ తుపానుతోనే గట్టెక్కే పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల వరకూ సాగర్ నిండుతుందన్న ఉద్దేశంతో కొద్దిపాటి నీటిని చెరువులకు పంపిణీ చేశారు. వాటిలో సగం నీటి మట్టం కూడా రాలేదు. ప్రస్తుతం చెరువుల్లో ప్రస్తుతం ఉన్న సగం నీళ్లు నవంబరు డిసెంబరు వరకు పూర్తిగా అడుగంటే అవకాశం ఉంది. తర్వాత వచ్చే వేసవిలో కనీసం పశువులకు కూడా నీళ్లు దొరికే పరిస్థితులు ఉండవన్న వ్యక్తం అవుతోంది.

# ఈకేవైసీ ప‘రేషన్’



వరంగల్ : రేషన్ బియ్యం తీసుకోవాలంటే కార్డులోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ చెప్పడంతో కార్డుదారులు సమీపంలోని చౌకధరల దుకాణం దగ్గర బారులు తీరుతున్నారు.

రేషన్ బియ్యం తీసుకోవాలంటే కార్డులోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ చెప్పడంతో కార్డుదారులు సమీపంలోని చౌకధరల దుకాణం దగ్గర బారులు తీరుతున్నారు. సర్వర్ నెమ్మదించడంతో గంటల తరబడి పడిగాపులు కాస్తూ.. ఈపాస్ యంత్రంలో వేలిముద్రలు వేసి వివరాలను నవీకరించుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 1.70 లక్షల మంది మాత్రమే ఈకేవైసీ పూర్తి చేసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. మృతి చెందిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగించడంతో పాటు.. బోగస్ పేరుతో రేషన్ బియ్యం దుర్వినియోగం కాకుండా కార్డులో పేర్లు ఉన్నవారికే లబ్ధి చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీని ప్రవేశపెట్టింది. దీనికి తుది గడువు విధించకపోయినా.. సాధ్యమైనంత త్వరగా ఈకేవైసీని పూర్తిచేయాలని డీలర్లను ఆదేశించారు.

సర్వర్ డౌన్‌తో సమస్యలు..

ఈకేవైసీ తప్పనిసరి అని డీలర్లు చెప్పడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వరుస కట్టారు. అయితే కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు వృద్ధుల వేలిముద్రలు నమోదు కావడం లేదు. చాలాసార్లు ఈపాస్ యంత్రాలు మొరాయిస్తున్నాయి. సర్వర్ డౌన్ కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేలిముద్రలు పడనివారికి ఐరిస్ ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేయాలన్నా.. సాంకేతికపరమైన తప్పిదాలు తలెత్తుతున్నట్లు కొందరు డీలర్లు చెబుతున్నారు.

ఎక్కడి నుంచైనా చేసుకోవచ్చు..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘రేషన్’ పోర్టబిలిటీ సౌకర్యం ద్వారా రేషన్‌కార్డు దారులు దేశంలోని ఏ రేషన్ దుకాణం నుంచైనా రేషన్ సరకులు తీసుకోవచ్చు. అదే విధంగానే ఈకేవైసీ కూడా తమకు సంబంధించిన రేషన్ దుకాణం నుంచే కాకుండా.. దేశంలో ఎక్కడి నుంచైనా అప్‌డేట్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు ఈకేవైసీ నవీకరణ కోసం సొంతూళ్లకు రావాల్సిన అవసరం లేదు. తమకు దగ్గరగా ఉన్న ఏ రేషన్ దుకాణంలోనైనా కార్డు వివరాలతో నేరుగా వెళ్లి అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం కల్పించారు.

అనర్హుల పేర్లు తొలగించేందుకే..

రేషన్‌కార్డుల్లో అనర్హుల పేర్లు తొలగించేందుకే ప్రభుత్వం ఈకేవైసీ చేపట్టింది. కార్డుదారుల కుటుంబ సభ్యులు మృతి చెందడం, ఆడపిల్లలకు పెళ్లై మెట్టినింటికి వెళ్లడం, మగ పిల్లలు పెళ్లి చేసుకొని వేరేగా ఉండటం జరుతున్నాయి. కానీ ప్రతినెలా రేషన్ బియ్యం మాత్రం కార్డులోని కుటుంబ సభ్యులందరికీ యూనిట్‌కు 6 కిలోల చొప్పున పంపిణీ యథావిధిగా జరుగుతుండటంతో దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించి, అనర్హులు, కుటుంబంలో లేనివారి పేర్లు తొలగించేందుకే ఈకేవైసీ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 7,88,463 మంది లబ్ధిదారుల్లో సుమారు 20శాతం మంది అందుబాటులో లేకున్నా.. బియ్యం మాత్రం పూర్తిస్థాయిలో పంపిణీ జరుగుతున్నట్లు పౌర సరఫరా అధికారులు అంచనా వేస్తున్నారు.

చౌకధరల దుకాణాలు : 509

లబ్ధిదారులు : 2,66,740

ఆహార భద్రత కార్డులు : 2,53,130

అంత్యోదయ : 13,603, అన్నపూర్ణ : 07

కొత్త కార్డులకు వచ్చిన దరఖాస్తులు : 5,292

మార్పులు, చేర్పులకు వచ్చినవి : 8,409

మందకొడిగా ప్రక్రియ..

రేషన్ దుకాణం : దుగ్గొండి 3వ దుకాణం

మొత్తం కార్డులు : 308

లబ్ధిదారులు : 925

ఈకేవైసీ పూర్తైన వారు : 125

సమస్య : సర్వర్ నెమ్మదించడంతో ఈకేవైసీ నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈ పని డీలర్లకు అప్పగించడంతో బియ్యం పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతు కుటుంబాల సభ్యులు పొలం పనులు వదులుకొని రావాల్సి వస్తోంది. వివరాల నమోదు త్వరగా పూర్తికాకపోవడంతో పలుమార్లు తిరగాల్సి వస్తోంది.

నవీకరణ నత్తనడక..నందిగామ (నల్లబెల్లి మండలం)

326, 1004, 180

సర్వర్ సమస్యతో కేవైసీ నవీకరణ నత్తనడకన సాగుతోంది. రోజూ కార్డుదారులు రేషన్ డీలర్ దగ్గరకు వచ్చి గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఒక్కొక్కరి వేలిముద్ర నవీకరణకు ఎక్కువ సమయం తీసుకుంటుండటంతో కాలయాపన జరుగుతోంది.

గంటల తరబడి నిరీక్షణ..

ఖానాపురం 1వ నంబరు

500, 1400, 390

రేషన్ కార్డుల్లో పేర్లున్న అందరూ ఈకేవైసీ చేయించుకోకపోతే బియ్యం ఇవ్వబోమని డీలర్లు చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు పనులు వదులుకొని డీలర్ల వద్దకు వస్తున్నారు. సర్వర్ నెమ్మదించడంతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు, హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. సైట్ తెరుచుకోవడంలేదని డీలర్లు వాపోతున్నారు.

పొలం పనులు వదులుకొని వచ్చా..– తోట ఉపేందర్, ఖానాపురం

ఈకేవైసీ కోసం డీలర్ దగ్గరకు మూడుసార్లు వెళ్లా. ఈపాస్ యంత్రంపై వేలిముద్ర వేయగానే సర్వర్ తిరుగుతూనే ఉంది. పని కాలేదు. పొలం పనులు వదులుకొని తిరగాల్సి వస్తోంది. పిల్లలు హాస్టల్‌లో ఉన్నారు. వారు కూడా రావాలంటున్నారు. బోగస్ లబ్ధిదారులను ఏరివేయడం మంచిదే. కానీ ఉన్నవారిపై ఒత్తిడి చేయడం సరికాదు. అధికారులు సర్వర్ డౌన్‌కాకుండా చూస్తే మంచిది.

అందరూ అప్‌డేట్ చేసుకోవాలి..– చందన్‌కుమార్, డీసీఎస్‌వో

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రేషన్‌కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ దగ్గర్లోని డీలర్ల దగ్గర ఈపాస్ యంత్రం ద్వారా ఈకేవైసీ నవీకరించుకోవాలి. దీనికి గడువు విధించకున్నా వీలైనంత త్వరగా పూర్తిచేసుకోవడమే మంచిది. ఈకేవైసీ పూర్తి చేయకపోతే రేషన్‌లో కోత విధిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొనలేదు.

# నిర్లక్ష్యం గూడుకట్టింది!



జయశంకర్ : జీవితంలో సొంతింటి కల నెరవేర్చుకోవాలనే పేదలకు నిరాశే మిగులుతోంది.. ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్లు ఏళ్లుగా నిర్మాణం పూర్తవడం లేదు. రెండు విడతల్లో మంజూరైన ఇళ్లలో 25 శాతమే సిద్ధమయ్యాయి.. మిగతావి వివిధ దశల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఆరంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. జిల్లాకు రెండు విడతల్లో 3,882 ఇళ్లు మంజూరు చేశారు. రూ.104.47 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టారు. వీటిని త్వరగా పూర్తిచేసేందుకు లబ్ధిదారుల కమిటీలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల గుత్తేదారులకు అప్పగించారు. మొదట్లో పనులు వేగంగానే జరిగినా.. తర్వాత ఆగిపోయాయి. అప్పటి నుంచి పెద్దగా పురోగతి లేదు. కొన్నిచోట్ల అడపాదడపా పనులు చేపడుతున్నారు. గతేదాది సంక్రాంతి కల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ సమయంలో హడావుడి చేసినా ఆ తర్వాత యథావిధిగా పనులు నెమ్మదించాయి. కొత్త పథకాలు రావడం, ఎన్నికల సమయం కావడంతో అధికారులు వాటిపైనే దృష్టి సారిస్తున్నారు.

ఎంపిక ఎప్పుడో..?

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో భాస్కర్ గడ్డలో జీప్లస్ 3 విధానంలో 416 రెండు పడక గదుల ఇళ్లను నిర్మిస్తున్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం శానిటేషన్, పెయింటింగ్ పనులు నడుస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరించారు. అర్హుల ఎంపిక జరగాల్సి ఉంది. వేశాలపల్లిలో 544 ఇళ్లను మూడు నెలల క్రితం లబ్ధిదారులకు కేటాయించారు. విద్యుత్తు, తాగునీరు, డ్రైనేజీ, తదితర సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సొంతంగా పనులు చేసుకుంటున్నారు.

సొంత ఖర్చులతో పనులు..

మధ్యలోనే నిర్మాణాలు ఆగిపోవడంతో ఏ నీడ లేని లబ్ధిదారులు సొంత ఖర్చులతో పనులు చేయించుకుంటున్నారు. గోడలు, తలుపులు కిటికీలు, ఫ్లోరింగ్, విద్యుత్తు తదితర పనులు చేసుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు పరదాలు కట్టుకుని అందులోనే ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు పూర్తి చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇక్కడ అసంపూర్తిగా దర్శనమిస్తున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు గణపురం మండల కేంద్రంలోనివి.. రూ.4.23 కోట్ల అంచనా వ్యయంతో 94 ఇళ్లకు 2019లో శంకుస్థాపన చేశారు. దాదాపు 60కి పైగా చివరి దశకు చేరుకున్నాయి. నిధులు రావడం లేదని గుత్తేదారు వెళ్లిపోయారు. ఇప్పుడా ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గాంధీనగర్ క్రాస్ వద్ద 45 ఇళ్లు పునాది దశలోనే వదిలేశారు. ఇవి టేకుమట్ల మండలం ఎంపేడులో నిర్మించిన ఇళు .. 2018లో 30 ఇళ్లు మంజూరు కాగా.. దాదాపు అన్నీ చివరి దశకు చేరుకున్నాయి. ప్లాస్టింగ్ చేయాల్సి ఉంది.. తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉంది. విద్యుత్తు కనెక్షన్ కూడా లేదు. అయినా లబ్ధిదారులు కొందరు అసంపూర్తి ఇళ్లలో ఉంటూ అవస్థలు ఎదుర్కొంటున్నారు.

మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇల్లు ఇది.. ఇక్కడ 2018లో 40 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు ఒక్కటీ పూర్తికాలేదు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు లబ్ధిదారులు అసంపూర్తి ఇళ్లలో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఓ ఇంటికి సంబంధించిన మెట్లు కూలిపోయాయి.

కాలయాపన చేస్తున్నారు– గాజుల నారాయణ, ముల్కలపల్లి, మొగుళ్లపల్లి మండలం

ఇటీవల కురిసిన వర్షాలకు ఇంట్లోకి నీరు చేరి ఇబ్బంది పడ్డాం. కనీసం దర్వాజలు బిగించలేదు. పరదాలు కట్టుకొని ఉంటున్నాం. అధికారులు, కమిటీ సభ్యులను ఎన్నిసార్లు అడిగినా బడ్జెట్ లేదంటున్నారు. ఇళ్లు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ముగ్గురు ఏఈలు మారారు. మా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు.

పనులు పూర్తి చేస్తాం..–వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్, భూపాలపల్లి

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే పనులు పూర్తవుతాయి.

# వైద్య సేవలు అంతంతే!

గంగాధర: పల్లెల్లో విష, డెంగీ జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు పకడ్బందీగా అందాలని ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. అయితే కొన్ని చోట్ల పరీక్షలు అందుబాటులో ఉండడంలేదు. మరికొన్నింట వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని చోట్ల ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు సేవలందిస్తున్నారు. బాధితులు చేసేదిలేక ఇతర ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు పీహెచ్‌సీలను పరిశీలించి ఇస్తున్న కథనం.

గుమ్లాపూర్‌లో 12.30 గంటలకే..న్యూస్‌టుడే, చొప్పదండి: చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఊరికి దూరంగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఆసుపత్రి భవనం కొండ పక్కనే ఉండడంతో చుట్టు చెట్లు ఉండడంతో తరచూ పాములు వస్తున్నాయి. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒకరే పని చేస్తున్నారు. మరో వైద్యుడిని గంగాధర ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై పంపించారు. ఫార్మాసిస్టు, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నిషియన్, పర్యవేక్షకులు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. నీటి సమస్య కొంత వేధిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆసుపత్రి మూసి ఉంది. ఈ విషయమై వైద్యాధికారి శ్రీకర్‌ని వివరణ కోరగా తాను రాగంపేటలో పల్లె దవాఖానా ప్రారంభం ఉండగా అక్కడి వెళ్లానని, మిగతా సిబ్బంది ఉదయం పూట విధులు నిర్వర్తించి వెళ్లినట్లు వివరించారు.

మూత్రశాలలు లేవు

కరీంనగర్ గ్రామీణ మండలం చామనపల్లిలో రోగులకు మూత్రశాలలు లేవు. రక్త పరీక్షలు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. వైరల్ జ్వరాలకు యాంటిబాటిక్ మందులు ఇస్తున్నామని సిబ్బంది చెబుతున్నా.. ప్రజలు మాత్రం కరీంనగర్ దవాఖానాకు వెళ్తున్నామని చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీసం ఎక్స్‌రే ప్లాంట్ కూడా లేదు. ఫార్మసిస్ట్, లాబ్ అసిసెంట్, ముగ్గురు ఏఎన్ఎంలు పని చేస్తున్నారు.

మందులున్నా.. పరీక్షలు లేవు

గంగాధర మండలంలోని 33 గ్రామ పంచాయతీలు, పది అనుబంధ గ్రామాలకు గంగాధరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దదిక్కుగా ఉంది. ఇటీవల వరకు బీపీ మాత్రలు లేకపోవడంతో జిల్లా ఆసుపత్రి నుంచి తెప్పించారు. ప్రతి రోజు వంద మందికి పైగా ఓపీకి వస్తుంటారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, లివర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్, కిడ్నీ వైద్యపరీక్షలు చేయించే ల్యాబ్ ఉన్నప్పటికీ సెలవు దినాల్లో చేయడంలేదు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్టాఫ్‌నర్సు సువర్ణ జ్వరపీడితులకు మందులు అందించగా కొద్దిసేపటికి సీహెచ్‌వో వచ్చారు. కుక్క, కోతి, పాముకాటు మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యాధికారి, ఇతర వైద్య సిబ్బంది హాజరు కాలేదు. మూడు వైద్యాధికారుల పోస్టులకుగాను రెండు ఖాళీగా ఉన్నాయి. కాంటింజెంట్ వర్కర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలో రక్షిత తాగునీటి పథకం చెడిపోయి ఏళ్లు గడిచినా మరమ్మతులు జరిపించడంలేదు.ఒంటి గంటకే రామడుగు పీహెచ్‌సీకి తాళం

రామడుగు పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు ఉన్నాయి. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు వైద్య సిబ్బంది సేవలందించారు. ఆ తర్వాత మూసివేశారు. మధ్యాహ్నం మూసివేతపై మండల వైద్యాధికారిని వివరణ కోరగా.. సాధారణ రోజుల్లో 10 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుందని, ఆదివారం ఒంటిగంట కు మూసివేస్తామని చెప్పారు. ఆ తర్వాత రోగులు ఎవరూ రారని చెప్పారు.పరీక్షలు చేస్తామన్నారు నాలుగు రోజులుగా నా కూతురు, నేను జ్వరంతో బాధపడుతున్నాం. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు జరిపించుకోవాలని రాగా పరీక్షిస్తామని చెప్పారు. బీపీ చూసి మందులు ఇచ్చి పంపించారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లలేకపోయాం. జ్వరం తగ్గకపోతే జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. ద్యావ మల్లయ్య

# ధాన్యం సేకరణకు వేళాయె!

పెద్దపల్లి: ప్రభుత్వం ఓవైపు వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సిద్ధమవుతుండగా కస్టమ్ రైస్ మిల్లింగ్(సీఎంఆర్) ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. అక్టోబరు రెండో వారంలో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశముండగా ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ఈసారి ధాన్యానికి కనీస మద్దతు ధరను పెంచింది. గతేదాది కంటే క్వింటాలుకు రూ.143 చొప్పున పెంచగా అక్టోబరు 1 నుంచి అమలులోకి రానుంది. గతంలో సాధారణ రకం క్వింటాలుకు రూ.2,040 ఉండగా ప్రస్తుతం రూ.2,183కు పెరిగింది. ఏ గ్రేడ్ రకం ధాన్యం ధరను రూ.2,060 నుంచి రూ.2,203కు పెంచారు. పెట్టుబడి వ్యయం పెరుగుతుండటం, వ్యవసాయం ద్వారా రైతులకు ఆదాయం తగ్గుతుండటంతో ప్రోత్సాహకంగా ఉండేందుకు కేంద్రం మద్దతు ధరలు పెంచింది.

4.15 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం

ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 301 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వానాకాలంలో 2,01,408 ఎకరాల్లో వరి సాగు చేయగా దాదాపు 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.గతేదాది వానాకాలంలో జిల్లాలో 2.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈసారి 4.90 లక్షల టన్నుల దిగుబడుల్లో విత్తనోత్పత్తికి సంబంధించి 75 వేల టన్నులు పోగా మిగిలిన 4.15 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

జిల్లాలో 64 సెర్ప్, 236 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 మార్కెట్ యార్డులు కలిపి మొత్తం 305 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కొనుగోలు కేంద్రాలకు టార్పాలిన్లు–4,239, తూర్పార యంత్రాలు–13, ప్యాడీ క్లీనర్లు–64, తేమ కొలిచే యంత్రాలు–360, తూకం యంత్రాలు–658, పొట్టు శుభ్రం చేసే యంత్రాలు–18, ఇతరత్రా అదనపు యంత్రాలు–20 సిద్ధం చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ వద్ద మొత్తం 1.07 కోట్ల గన్నీ సంచులు అందుబాటులో ఉండగా, ఇందులో 49.62 లక్షలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన 58.25 లక్షల గన్నీ సంచుల్లో గిడ్డంగుల్లో ధాన్యం నిల్వ ఉంది.

నత్తనడకన సీఎంఆర్ ప్రక్రియ

సీఎంఆర్ కింద 2022–23 వానాకాలంలో మొత్తం 198 మిల్లులకు 2,99,757 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించగా 2,00,837 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు కేవలం 27 శాతం మేర అంటే 54,052 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐకి అందించారు.

గత యాసంగిలో 132 మిల్లులకు 3,51,951 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 2,39,327 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పగించాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 48,1460 మెట్రిక్ టన్నులు (20 శాతం) మాత్రమే అందించారు.ప్రస్తుత వానాకాలం ధాన్యం చేతికందేనాటికి గతేదాది ఇదే సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ప్రక్రియ తుది దశను చేరాల్సి ఉంది. అయితే 27 శాతమే పూర్తి కావడం మిల్లర్ల నిర్లక్ష్యాన్ని, అధికారుల పర్యవేక్షణ లోపాన్ని వెల్లడిస్తోంది.సకాలంలో సీఎంఆర్ ఇవ్వని 7 బియ్యం మిల్లులను ప్రభుత్వం డిఫాల్టర్లుగా గుర్తించింది. ఈ మిల్లర్ల నుంచి రూ.9.50 కోట్ల విలువైన 5,142 మెట్రిక్ టన్నుల బియ్యం స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా ఇంకా రూ.7.27 కోట్ల విలువైన 3,882 మెట్రిక్ టన్నులు తీసుకోవాల్సి ఉంది. కేవలం రూ.26.69 లక్షల విలువైన 740 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే స్వాధీనం చేసుకున్నారు.

గత కేటాయింపుల్లో సమస్యలతోనే జాప్యం ఈ వానాకాలంలో జిల్లావ్యాప్తంగా 4.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశాం. సీఎంఆర్ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది. గతంలో మిల్లులకు సీఎంఆర్ కేటాయింపులో సమస్యలు రావడం వల్లే ఆలస్యమవుతోంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ సాఫీగా సాగుతోంది. నెలాఖరు వరకు పూర్తి స్థాయిలో సీఎంఆర్‌ను సేకరిస్తాం. ఎం.శ్రీకాంత్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి

# రక్షణ పొర.. తెల్లదోమలకు తెర

కొత్తగూడెం : సంప్రదాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న మిరప తోటలను తెగుళ్లు నాశనం చేస్తున్నాయి. ఎన్నో కష్టాలు అనుభవించినా రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టే రైతులు పూర్తి నష్టాన్ని చవిచూస్తున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న మిరప తోటలను తెగుళ్లు నాశనం చేస్తున్నాయి. ఎన్నో కష్టాలు అనుభవించినా రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టే రైతులు పూర్తి నష్టాన్ని చవిచూస్తున్నారు. ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జెమిని వైరస్ (బొబ్బ తెగులు), ఇతర తెగుళ్లతో రెణ్నెల్లకు పైగా వయసున్న తోటలను పదుల ఎకరాల్లో తొలగించిన వైనం కలచివేసింది. మళ్లీ దుక్కి సిద్ధం చేసి మొక్కలు నాటాలంటే అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం వినూత్న సాగు పద్ధతులతో ఈ సమస్యలు అధిగమిస్తున్నారు. ముఖ్యంగా మల్చింగ్ విధానంలో సాగు చేసిన పైరుకు బొబ్బరోగం, ఇతర చీడపీడలు సోకలేదని రైతులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

వ్యయం తక్కువ.. ప్రయోజనాలెక్కువ

సంప్రదాయ సాగులో పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చులు అధికంగా ఉంటాయి. దీంతో ఖర్చు ఆదాకోసం మల్చింగ్ విధానంపై మొగ్గు



చూపుతున్నారు. సాధారణ విధానంలో ఎకరాకు పెట్టుబడి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. డ్రిప్‌తో కలిసి రూ.50 వేలు ఖర్చు చేయగలిగితే పంట చేతికందుతుంది. కలుపు ప్రభావం తక్కువ. మొక్కల ఎదుగుదల బాగుంటుంది. కలుపు నివారణకు కూలీల అవసరం తక్కువ. సస్యరక్షణలో సంప్రదాయం కంటే మల్చింగ్ పద్ధతిలో శ్రమ, ఖర్చు తక్కువ. సుమారు 30-40 శాతం పెట్టుబడి ఆదాయం అవుతుంది.

ఇదీ.. ప్రయోజనం

మల్చింగ్ పద్ధతిలో తెగుళ్ల బెడద పెద్దగా లేదని రైతులు పేర్కొన్నారు. రైతుల్ని నిండా ముంచుతున్న బొబ్బ తెగులు సోకడానికి తెల్ల దోమలే కారణం. ఇవి కలుపుపై చేరి మొక్కలకు వ్యాపిస్తాయి. మల్చింగ్ తోటల్లో కలుపు పుట్టేందుకు ఆస్కారం లేదు. కాబట్టి దోమల బెడద ఉండదు. ప్లాస్టిక్ పైపొర ఎండకు వేడెక్కడం, మెరవడం కారణంగా దోమలతో పాటు పంటకు నష్టం కలిగించే ఇతర పురుగులూ దానిపైకి చేరవు.

సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

భద్రాద్రి: 4,000

ఖమ్మం: 10,000

5 క్వింటాళ్ల దిగుబడి అధికం

తాళ్లూరి పాపారావు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, సుజాతనగర్

గత పదేళ్లుగా 30 ఎకరాల్లో మిరపను మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్నా. సాధారణ పద్ధతి కంటే ఈ పద్ధతి అన్ని విధాలా మేలు. సుమారు నుంచి 4-5 క్వింటాళ్ల అధిక దిగుబడి లభిస్తుంది. తెగుళ్ల సమస్య చాలా వరకు తగ్గుతుంది. నీరు, ఎరువులు, రసాయనాలు తక్కువగా వినియోగించడం వల్ల పెట్టుబడి గణనీయంగా తగ్గుతుంది.

చీడపీడలు సోకే అవకాశాలు తక్కువ

శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, భద్రాద్రి జిల్లా

ఉభయ జిల్లాల్లో మిరప పైర్లకు జెమిని వైరస్ సోకి తీరని నష్టం కలిగిస్తోంది. రైతులు ఈ సమస్య మా దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువగా పత్తి సాగయ్యే పరిసర ప్రాంతాల్లోని మిరప తోటలకు ఈ తెగులు అధికంగా సోకుతుందని గుర్తించాం. ముందస్తు చర్యలుగా మిరప తోట చుట్టూ రెండు లేదా మూడు వరుసల్లో మొక్కజొన్న, జొన్న విత్తుకోవడం వల్ల బయట నుంచి వ్యాప్తిచెందే దోమలను అరికట్టవచ్చు. మల్చింగ్ విధానంలో తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని రైతులు గమనించాలి. కలుపు పుట్టే అవకాశం లేకపోవడమే కలిసొచ్చే అంశం.

# ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ



ఖమ్మం : పదోన్నతులు పొందాలంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తప్పనిసరిగా ఉండాలని కొంతమంది ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడుతుందోనని ఆ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ టెట్ నిబంధన అమలు జరిగితే ఖమ్మం జిల్లాలో తక్కువ మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉంది. 2011లో నుంచి టెట్ విధానం అమలు చేస్తున్నారు. తర్వాత 2012, 2017లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరిగింది. 2012 డీఎస్సీలో వంద లోపు, 2017 టీఆర్‌టీలో నాలుగైదు పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. ఏజెన్సీలో రెండుసార్లు కలిపి 40 పోస్టుల వరకు భర్తీచేశారు. ప్రస్తుతం 350 పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. ఒకవేళ టెట్ అర్హత తప్పనిసరి అయితే.. పదోన్నతులు కొందరికే దక్కే వీలు కలుగుతుంది. ఫలితంగా పాఠశాలల్లో పెద్ద ఎత్తున ఖాళీలు మిగలనున్నాయి. హైకోర్టును కొందరు ఆశ్రయించినప్పటికీ.. పదోన్నతులు నిలిచిపోకుండా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ఉపాధ్యాయ లోకం ఎదురుచూస్తోంది.

'స్పౌజ్' దరఖాస్తులపై పరిశీలన...

స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయులు వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. ఎడిట్ ఆప్షన్లు ముగిశాయి. 107 మంది స్పౌజ్‌లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై జిల్లా విద్యాశాఖ పూర్తి పరిశీలన చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు పెట్టుకుంటే ఇబ్బందులు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. ఆప్షన్లు పెట్టుకున్న ఉపాధ్యాయులకు నేటి నుంచి బదిలీలు జరిగే అవకాశం ఉంది.

మరి కొన్ని విషయాల్లోనూ..

ఎస్‌జీటీలకు పీఎస్‌ల హెచ్ఎం ఉద్యోగోన్నతుల విషయంలో బీఈడీ చేసిన వారు కాకుండా టీటీసీ వారికే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని కోర్టు డైరెక్షన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంలోనూ ప్రభుత్వం ఏం అడుగులు వేస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. భాషా పండితులు, పీఈటీలకు కూడా ఉద్యోగోన్నతుల విషయంలో కోర్టు తుది తీర్పు ఇచ్చింది. వీరికి ఇదే షెడ్యూల్‌లో ఉద్యోగోన్నతులు ఇస్తారా? లేదా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

తప్పుల సవరణలో విద్యాశాఖ నిమగ్నం

సాఫ్ట్‌వేర్ తప్పిదం వల్ల కొంతమంది పాయింట్లలో తేడాలు ఉంటున్నాయి.

ప్రాధాన్య కేటగిరీలకు సంబంధించిన ఉపాధ్యాయుల రికార్డులను క్షుణ్నంగా పరిశీలించి తప్పులు సరిచేశారు.

ప్రధానంగా పాయింట్లు సమానంగా వచ్చినప్పుడు ర్యాంకుల ఆధారంగా జాబితాను తయారు చేస్తున్నారు. 2000 సంవత్సరానికి ముందు ర్యాంకులు లేవు. తర్వాతే ఈ విధానం ప్రకటించారు. దీంతో చాలామంది తోచిన ర్యాంకు స్వయంగా నమోదు చేయడం సమస్యాత్మకంగా మారింది. వీటిని గుర్తించి సరిచేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

610 జీవో ద్వారా స్థానికతను నిర్ధారించేందుకు మార్కులు ఇచ్చారు. వాటినీ ఉపాధ్యాయులు అనధికారికంగా నమోదు చేయడం పొరపాట్లకు తావిస్తోంది.

వెబ్, ఎడిట్ ఆప్షన్లు పెట్టుకునే ప్రక్రియ పూర్తయింది. వీటి తర్వాత బదిలీలు చేపడతాం. టెట్ అర్హత విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుంది. తమకు ఉన్న సమాచారం మేరకు బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం ఉండదు. సోమశేఖరశర్మ, డీఈఓ

# ఆశలు పదిలం!

జయశంకర్ : ప్రధాని మోదీ ప్రకటనతో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుపై సుదీర్ఘ కాలంగా ఉన్న అపోహలకు తెరపడింది. రాష్ట్ర విభజన కాలం నాటి కల సాకారం కాబోతోందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన వర్సిటీకి వారి ఆరాధ్య దేవతలైన సమ్మక్క-సారక్క పేరు పెడుతున్నట్లు వెల్లడించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నూతన విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభమవుతాయా లేక వచ్చే విద్యా సంవత్సరంలో జరుగుతాయా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే దేశంలోని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరానికి(2023-24) ప్రవేశాల ప్రక్రియ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా జరిగింది. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రవేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తే అందుకు ప్రత్యేక ప్రవేశ పరీక్షను జరుపుతారా, భవనాలు వసతి తాత్కాలికంగా ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

335.16 ఎకరాలు కేటాయింపు

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అనేది రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పొందుపర్చింది. యూనివర్సిటీ ఏర్పాటుకు సుదీర్ఘ అన్వేషణ అనంతరం ములుగు జిల్లా అనువుగా ఉంటుందని భావించారు. ములుగు సమీపంలోని గట్టమ్మ గుడికి ముందు, జాతీయ రహదారికి దక్షిణం వైపు ఉన్న 335.16 ఎకరాల స్థలాన్ని ఖరారు చేశారు. పలుమార్లు హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ప్రతినిధులు వచ్చి స్థలాన్ని పరిశీలించి అనువుగానే ఉందని నిర్ధారించి సంతృప్తి చెందారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక కూడా పంపారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తయి సుమారు మూడేళ్లు కావస్తోంది. అయినప్పటికీ యూనివర్సిటీ ఊసు లేకపోవడం, పార్లమెంటు సమావేశాల్లోనూ ప్రస్తావన రాకపోవడంతో ఇక రాకపోవచ్చని అందరూ భావించారు. రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు ఆందోళనా కార్యక్రమాలు కూడా చేశారు. ఈ ప్రాంత ప్రజల్లో ఉన్న అపోహలను భారత ప్రధాని పటాపంచలు చేశారు.

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగయ్యే అవకాశం

ఆదివాసీలు అత్యధికంగా ఉన్న ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు వల్ల ఆదివాసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన స్థితి గతులపై విస్తృతమైన పరిశోధనలు చేసేందుకు ఎంతో అవకాశం ఉంటుంది. పరిశోదనల ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలున్నాయి. అధ్యయనాలు, పరిశోధనల ఆధారంగా ప్రభుత్వ పాలసీలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. గిరిజనులు ఉన్నత విద్యలో రాణించడానికి రకరకాల కోర్సులు ఏర్పాటు చేసే



అవకాశం ఉంటుంది. గిరిజనులు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది.

రవాణా అనుకూలం

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు రవాణా పరంగానూ అనుకూలంగా ఉంది. హైదరాబాద్- భూపాలపట్నం జాతీయ రహదారికి ఆనుకొని స్థలం నిర్ధారించారు. వరంగల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా 45 నిమిషాల్లో నిర్దేశించిన గిరిజన యూనివర్సిటీకి చేరుకునే అవకాశాలున్నాయి. హైదరాబాదు వరకు వరంగల్ నుంచి విమాన సౌకర్యం రానుంది. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు ఉండటం వల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు రాకపోకలున్నాయి.

చకచకా భూసేకరణ

గిరిజన యూనివర్సిటీకి ములుగు సమీపంలోని గట్టమ్మ గుడి వద్ద మొత్తం 335.16 ఎకరాలు కేటాయించారు. భూసేకరణకు గిరిజన సంక్షేమ శాఖ రూ.10 కోట్లు కేటాయించి ప్రక్రియను చకచకా నిర్వహించారు. సేకరించిన స్థలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూమి 285 ఎకరాలు, అటవీ భూమి 50 ఎకరాలు ఉంది. రెవెన్యూ భూమిని గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించారు. స్థలానికి హద్దులు నిర్ధారించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రెండేళ్ల కింద గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా చేశారు. తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలనుకుంటే ములుగు మండలం జాకారంలోని గిరిజన యువజన శిక్షణ కేంద్రం అనువుగా ఉంటుందని భావించి నిర్ణయించారు.

గిరిజన యూనివర్సిటీని ప్రకటించడం హర్షణీయం

అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎంపీ, విశ్రాంత ప్రొఫెసర్

గిరిజన యూనివర్సిటీ ఇచ్చినందుకు ధన్యవాదాలు. యూనివర్సిటీలో గిరిజనులకు సీట్లు పెంచాలి. తాను ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు గిరిజన యూనివర్సిటీ ఆంధ్రాకు తరలించాలనుకునే సమయంలో పోరాడి అడ్డుకున్నాం. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ కేటాయించారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

గోనా నాయక్, సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్

గిరిజన విద్యార్థులకు స్థానికతను ఆధారం చేసుకొని సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలి. ఇక్కడి గిరిజన విద్యార్థులకు అనుకూలమైన కోర్సులను ప్రవేశపెట్టాలి. గిరిజనుల భాష, సంస్కృతి సంప్రదాయాలు, సాహిత్యం ప్రతిబింబించే విధంగా ఉండాలి. ప్రత్యేక పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. స్థానిక భాషకు అనుగుణంగా తెలుగు కోర్సులు ప్రవేశపెట్టాలి. పరిశోధనలు బాగా జరగాలి. గిరిజన సంస్కృతిని కాపాడాలి.

పరిశోధనలకు మంచి అవకాశం

కొర్నిబెల్లి గణేష్, బిర్సా ముండా పరిశోధన కేంద్రం, కామారం, తాడ్వాయి మండలం ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం శుభ పరిణామం. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం వల్ల పరిశోధనలు చేయడానికి మంచి అవకాశం ఉంటుంది. యావత్ ఆదివాసీ ప్రజలకు యూనివర్సిటీ ద్వారా పరిశోధనర ఫలాలు, అభివృద్ధి జరగుతుందని ఆశిస్తున్నాం.

పోరాట ఆకాంక్ష నెరవేర్చుకునే అవకాశం

మైపతి అరుణ్ కుమార్, రీసెర్చ్ స్కాలర్, తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం శుభ పరిణామం. సమ్మక్క-సారలమ్మ పోరాట ఆకాంక్ష నెరవేర్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అదివాసీ ప్రజలకు ములుగు అందుబాటులో ఉండే ప్రాంతం. మధ్య భారతదేశంలో ఉన్న ఆదివాసీ విద్యార్థులకు బాగా ఉపయగపడనుంది. పరిశోధన ప్రయోజనాలు ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడతాయి. గిరిజన మహిళా సాధికారతధనసరి లలిత, రీసెర్చ్ స్కాలర్, సమ్మక్క-సారక్క ఆర్కియలాజికల్ రీసెర్చ్ సెంటర్, కామారం గిరిజన యూనివర్సిటీ ద్వారా మహిళా సాధికారతకు అవకాశం ఉంది. గిరిజన మహిళలకు ఉన్నత విద్య అవకాశాలు మెరుగై వారు సాధికారత సాధించే అవకాశం ఉంది.

# దాతృత్వానికి దక్కనున్న గౌరవం



భద్రాచలం : భద్రాచలం మహా పుణ్యక్షేత్రం. ఎన్నో వేడుకలకు నెలవైన భూమి. ఈ క్షేత్ర చరిత వింటే చాలు.. అంతా శుభమే కలుగుతుందని పండితులు సుభాషిస్తుంటారు. త్రేతాయుగంలో వనవాసం సమయంలో రాముడు ఇక్కడకు వచ్చాడు. భద్రాచలం మహా పుణ్యక్షేత్రం. ఎన్నో వేడుకలకు నెలవైన భూమి. ఈ క్షేత్ర చరిత వింటే చాలు.. అంతా శుభమే కలుగుతుందని పండితులు సుభాషిస్తుంటారు. త్రేతాయుగంలో వనవాసం సమయంలో రాముడు ఇక్కడకు వచ్చాడు. భద్రుడికి ఇచ్చిన వరం మేరకు ఇక్కడ కొలువై.. భక్తుల కొంగు బంగారమై నిత్య పూజలు అందుకుంటున్నాడు. ఈ పుణ్యక్షేత్రానికి దాతృత్వంతో అండగా నిలిచే వారికి ఘనసన్మానం నిర్వహించనుండటం విశేషం. రూ.లక్షకు మించి వస్త్ర, వస్తు, అన్నదానం, వసతి నిర్మాణం, బంగారు వెండి వాహనాలు, ఆభరణాలు వంటివి సమకూర్చడంలో దాతలదే కీలక పాత్ర. దీన్ని గుర్తించిన ఈవో రమాదేవి దాతలను సన్మానానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

సత్రంలో తొలి వేడుక..రూ.4.7 కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక తానీషా కల్యాణ మండపం సమీపంలో సత్రాన్ని నిర్మించారు. ఇందులో అధికారికంగా తొలి కార్యక్రమం సోమవారం ఆరంభిస్తున్నారు. రూ.లక్షకు పైగా విరాళమిచ్చిన దాతలు 900 మందిని గుర్తించి సమాచారం ఇచ్చారు. వారిలో వేడుకకు వచ్చేందుకు 200 మంది సానుకూలత తెలిపారు. దూరప్రాంతాల వారికి వసతి కల్పిస్తారు. గాంధీ జయంతి కావడంతో భక్తులు ఎక్కువమంది ఆన్‌లైన్‌లో గదులను బుక్ చేసుకుంటే దాతలకు ఇబ్బంది అవుతుందని అధికారులు గ్రహించారు. ఆన్‌లైన్ బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆలయ ఉద్యోగులకు విధులు కూడా కేటాయించారు.

వారి ఔదార్యమే.. అండ

గతంలో రూ.50 లక్షలను వెచ్చించి ఓ సంస్థ శ్రీరామ రథాన్ని బహుకరించింది. కొందరు బంగారు వాహనాలు బహుకరించారు. ఓ దాత అద్దాల మండపం నిర్మించారు.

బెంగుళూరుకు చెందిన భక్తులు మూలవిరాట్‌కు రూ.4 కోట్లతో 10 కిలోల బంగారు కవచాలను సమర్పించారు.

శ్రీనివాసన్ అనే భక్తుడు రూ.40 లక్షలతో ప్రధాన ఆలయం వద్ద బంగారు వాకిలిని ఏర్పాటు చేశారు. మరో దాత ముత్యాలతో పొదిగిన ముత్తంగి అలంకార వస్త్రాలను తయారు చేయించారు. ఇంకో దాత ప్రస్తుతం వెండి వాకిలి పనులు చేపట్టారు.

రాముడికి రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా ఇందులో ఎక్కువ భాగం దాతలు దేవుడికి సమర్పించిందే. గోశాల విస్తరణకు ఎంతో మంది సహకరిస్తున్నారు. సత్రాలు, సదనాలు, కుటీరాల నిర్మాణాలకు భక్తులు సాయం చేస్తున్నారు.

# పూర్వ వైభవం వచ్చేనా..?

మహబూబాబాద్ : రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్ సభలో చేసిన ప్రకటనతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పసుపు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సాగుకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఏడేళ్ల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది. పంట సాగు చేసి ఆశించిన దిగుబడులను సాధించినప్పటికీ మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగును తగ్గించుకుంటూ వస్తున్నారు. ఈసారి క్వింటాలుకు రూ.10 వేల పైనే ధర ఉండడంతో శీతల గిడ్డంగుల్లో భద్రపరుచుకున్న రైతులు విక్రయిస్తున్నారు.

సాగు విస్తీర్ణం పెరిగేనా: ఉమ్మడి జిల్లాలో 2020 నుంచి ఏటా పంట సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది. 2020లో 24,178 ఎకరాల్లో సాగవ్వగా 2021లో 13,743.38 ఎకరాలు, 2022లో 4965.08 ఎకరాలు, 2023లో 2305 ఎకరాల్లోనే సాగయింది. ఏటా వేల ఎకరాల విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ప్రధానంగా అత్యధికంగా సాగయ్యే మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ సాగు విస్తీర్ణం తగ్గుతోంది. బోర్డు ఏర్పాటుతోనైనా 2014-15 లో సాగైనట్లుగా సుమారు 40 వేల ఎకరాలకు పెరిగి పంటకు పూర్వవైభవం రావాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుకుంటుకున్నారు.

పసుపు సాగుకు మంచి రోజులు- బొబ్బాల యాకూబ్‌రెడ్డి, కేసముద్రం

వరంగల్ ఉమ్మడి జిల్లాలో పదేళ్ల కిందట సుమారు 10 వేల ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ప్రస్తుతం 2 వేల ఎకరాలకు పడిపోయింది. మద్దతు ధర లేకపోవడం, పెట్టుబడి పెరిగిపోవడం, దిగుబడి తగ్గిపోవడంతో రైతులు విసుగు చెంది సాగును మానుకుంటున్నారు. ఇలాంటి సమయంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత రైతులకు తిరిగి మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. పరిశోధనలు నిర్వహించి ఈ ప్రాంత నేలలకు అనుకూలమైన వంగడాలు, అధునాతన పరికరాలు, రాయితీలు అందించే అవకాశం ఉంది.

మద్దతు ధర లభించే అవకాశం- బిజ్జాల వెంకటేశ్వర్లు, కేసముద్రం

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు పసుపు విక్రయాల్లో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. పదేళ్ల కిందట ఏడాదికి 1.50లక్షల క్వింటాల పసుపు మార్కెట్‌లో విక్రయానికి వచ్చేది. ప్రస్తుతం 30వేల క్వింటాలుకు మించి రావడం లేదు. పసుపు బోర్డు ఏర్పాటు చేయడం వల్ల నాణ్యమైన పసుపు మార్కెట్‌కు వస్తుంది. ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. పసుపు ధర పడిపోయిన సమయంలో ప్రభుత్వం మద్దతు ధరతో ఖరీదు చేసే అవకాశం ఉంటుంది.

# ఆగిన వంట.. ఆకలి మంట!

భూపాలపల్లి : భూపాలపల్లి మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 210 మంది విద్యార్థులున్నారు. నిత్యం 170 నుంచి 180 మంది పాఠశాలకు హాజరవుతారు. కొద్ది రోజులుగా 130 మంది లోపే వస్తున్నారు. ఎందుకు గైర్హాజరవుతున్నారని ఆరా తీయగా వంట కార్మికుల సమ్మె కారణంగా మధ్యాహ్న భోజనం అందించకపోవడమే కారణమని గుర్తించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 2,360, ప్రాథమికోన్నత 401, ఉన్నత పాఠశాలలు 567 వరకు ఉన్నాయి. దాదాపు అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొందని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది.. కానీ, వంట ఏజెన్సీలకు ఐదు నెలలుగా బిల్లులు రాకపోవడంతో గత నెల 20 నుంచి ఏఐటీయూసీ అనుబంధ సంఘం కార్మికులు వంట నిలిపివేసి ఆందోళన చేపడుతున్నారు. సమ్మె కారణంగా మధ్యాహ్న భోజనం అందక విద్యార్థులు ఇబ్బందులు పడటంతో పాటు హాజరు శాతం తగ్గింది. ఇలా మరికొద్ది రోజులు గడిస్తే.. విద్యార్థులు చదువులో వెనుకబడే ప్రమాదం ఉందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటివరకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని భోజనం



సక్రమంగా అందేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెరిగిన నిత్యావసర సరకులు, కూరగాయల ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, కనీస వేతనాలు చెల్లించాలని, నియామక పత్రాలు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు. అదేవిధంగా ప్రమాద బీమా, పీఎస్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు కల్పించి, వంట సరకులతో పాటు, గ్యాస్, కోడిగుడ్లు, వంట పాత్రలను ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాలువ గట్లు.. శిఖం భూములు!

మహబూబాబాద్ : పల్లెల్లో యువత, చిన్నారులు, క్రీడాకారులు తమ శరీరాకృతిని మెరుగుపరుచుకోవడానికి.. తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని చాటడానికి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తోంది. పలుచోట్ల ఆదిలోనే వీటి ఏర్పాటులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. చెరువు శిఖాలు, గుట్టల ప్రాంతాలు, కాలువ గట్ల వెంబడి.. కొన్ని చోట్ల పాఠశాల, కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేస్తున్నట్లుగా బోర్డులు పాతి చేతులు దులుపుకొంటున్నారు. కొన్ని చోట్ల ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. సరైన సదుపాయాలు కల్పించక.. నిర్వహణను గాలికొదిలేశారు. నిరుపయోగంగా మారడంతో ఇక్కడికి రావడానికే ఎవరూ ఇష్టపడడం లేదు.

'ఉపాధి' నిధులతో ఏర్పాటు: క్రీడా ప్రాంగణాలకు ఉపాధిహామీ పథకం ద్వారా నిధులను కేటాయిస్తున్నారు. ఏర్పాటు చేసే స్థలం, అక్కడి పరిస్థితులను బట్టి ఒక్కోదానికి రూ.1.67 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు ప్రతిపాదిస్తున్నారు. చాలా చోట్ల బోర్డులను ఏర్పాటు చేసి అందుకు అయిన ఖర్చుల బిల్లులను విడుదల చేయించుకుంటున్నారు. పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదని అధికారులు చెబుతున్నారు.

ఇలా ఉండాలి..

ఎకరం స్థలం అవసరం..

గ్రామం లేదా గ్రామానికి సమీపంలో అందరూ సులువుగా వెళ్లి రావడానికి అందుబాటులో ఉండే ప్రాంతం.

మౌలిక సదుపాయాలు కల్పించాలి.

ఎంచుకున్న స్థలంలోని తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించి మైదానం చదును చేయాలి.

చుట్టూ మొక్కలు పెంచాలి. నిర్ణీత కొలతల్లో ప్రవేశ ద్వారం ఉండాలి. నిర్ణీత కొలతల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులు.. లాంగ్‌జంప్ కోసం 6 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు, 0.5 మీటర్ల లోతులో గుంత తీసి ఇసుక నింపాలి. వ్యాయామం కోసం సింగిల్, డబుల్స్ ఏర్పాటు చేయాలి. పర్యవేక్షణకు ప్రతి మండలానికి ప్రత్యేక అధికారిని నియమించాలి. పరిశీలనలో ఏం తేలిందంటే..

జిల్లాలో ఏర్పాటు చేసిన పలు క్రీడా ప్రాంగణాలను పరిశీలించింది. చాలాచోట్ల పనులన్నీ హడావుడిగా, ఇష్టారీతిన చేసి మమా అనిపిస్తున్నారు. ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు..

సరిపడా ప్రభుత్వ స్థలాలు లేవనే కారణంతో.. త్వరితగతిన పూర్తి చేయాలనే తొందరలో రెండు గుంటల విస్తీర్ణం కలిగిన ఖాళీ స్థలం కనిపిస్తే చాలు బోర్డులు పాతారు. క్రీడా పరికరాలు ఏర్పాటు చేయడం లేదు. వాలీబాల్ కోర్టు కోసం రెండువైపులా స్తంభాలు నాటుతున్నారు. అలాగే స్వాగత తోరణం, వ్యాయామ బార్లు పాతుతున్నారు.

లాంగ్ జంప్ పిట్‌లు, ఖోఖో కోర్టులు, చదును చేసిన మైదానాలు చాలా తక్కువగా ఉంటున్నాయి... మైదానం చుట్టూ మొక్కలు నాటడం లేదు. ఊరికి దూరంగా.. నిరుపయోగంగా భీమదేవరపల్లి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సమ్మక్క బోటీ వద్ద ప్రభుత్వ స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. భూమి చదును చేసి, మొరం పోశారు. క్రీడా ప్రాంగణం నామ ఫలకం ఏర్పాటు చేశారు. అక్కడ మౌలిక వసతులు లేవు. నిరుపయోగంగా మారింది. క్రీడా ప్రాంగణం ఏర్పాటు కోసం సొంత నిధులు రూ.1.30లక్షలు ఖర్చు చేసినా రూపాయి బిల్లు రాలేదని సర్పంచి సాతూరి స్వాతి తెలిపారు. ఎల్కతుర్తి మండలం సూరారంలో ఏర్పాటు చేయాల్సిన క్రీడాప్రాంగణం మూడు కిలోమీటర్ల దూరంలో చెరువు శిఖంలో ఏర్పాటు చేశారు. గ్రామానికి దూరంగా ఉండటంతో ఎవరూ వెళ్లడం లేదు. చెరువు శిఖంలో ఇప్పటికే పేదలు గుడిసెలు వేశారని, మిగితా భూమి కబ్జా కాకముందే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశామని సర్పంచి కుర్ర సాంబమూర్తి తెలిపారు. ఎల్కతుర్తి(హనుమకొండ జిల్లా)

దామెర మండలం ల్యాదెళ్ల గ్రామంలో గుట్ట వద్ద క్రీడా మైదానం చేశారు. ఆ గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోగా గుట్ట వద్ద ఉన్న సుమారు 20 గుంటల స్థలాన్ని క్రీడా మైదానంగా బోర్డును ఏర్పాటు చేశారు. ఆటలకు వీలుగా లేదు. పేరుకే క్రీడా మైదానం పేరుకే మిగిలింది. పరకాలపర్వతగిరి: దూపతండ పాఠశాల ముందు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు ఇది. ఇక్కడ ఎటువంటి పనులు పూర్తి కాలేదు. నల్లబెల్లి: మండలంలో అసంపూర్తిగా ఉన్నాయి. 29 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయగా, చాలా గ్రామాల్లో పనులు పూర్తి కాలేదు. ఐదు గ్రామాలకు మాత్రమే బిల్లులు చేసినప్పటికీ చెల్లింపులు జరగలేదు. నిబంధనల ప్రకారం పనులు చేసిన వాటికే బిల్లులు

– సన్యాసయ్య, డీఆర్‌డీవో, మహబూబాబాద్ క్రీడా ప్రాంగణాలను ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేస్తున్నాం. కూలీల చేత చేసిన పనులకు బిల్లులు ఇచ్చాం. మెటీరియల్ బిల్లుల చెల్లింపులో కొన్నింటికి చెల్లించాం. కొన్ని ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేసిన వాటికే బిల్లులు ఇస్తున్నాం.

# పక్కదారి పడుతున్న బియ్యం!

మహబూబాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం పౌర సరఫరాల గోదాముల నుంచి ప్రతి నెల బడులకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం సరఫరా చేస్తుంటారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం పెట్టాలి. అయితే హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు, బియ్యం నిల్వలకు తేడాలు ఉన్నాయి. బియ్యాన్ని నిల్వ చేసి పక్కదారి పట్టిస్తున్నారు. ఈ విషయమై జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి ఫిర్యాదులు వచ్చాయి. బడిలో తనిఖీ చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు తనిఖీలు చేపట్టగా బియ్యం నిల్వల్లో తేడాలు ఉన్నట్లు తేలింది.

తప్పుడు రికార్డులు...

జులైవాడ ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 550 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ నిబంధనల మేరకు భోజనం పెట్టాలి. కానీ సరిపడా పెట్టకుండా బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు. నెలాఖరులో నిల్వ ఉన్న బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. అధికారులు ఆదివారం పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో 13.50 క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల్లో బియ్యం నిల్వలు లేవని చూపించడంతో పాటు ఇంకా 3.16 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉందని నమోదు చేశారు. ఈ తేడాను అధికారులు గుర్తించారు. దీనిపై అదనపు కలెక్టర్ సంధ్యారాణికి సోమవారం నివేదిక అందజేశారు. ఈ రకంగా మిగిలించిన బియ్యాన్ని ప్రతీ నెల పక్కదారి పట్టిస్తున్నట్లు తెలిసింది.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం– రామ్‌కిషన్‌రాజు, మండల విద్యాధికారి హనుమకొండ

బియ్యం నిల్వల్లో తేడాలు ఉన్నట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు. నేను పాఠశాలలకు వెళ్లి పరిశీలించా. బియ్యం నిల్వలు లేనట్లు చూపిస్తున్నారు. పాఠశాలలో మాత్రం నిల్వలు కనిపిస్తున్నాయి. పూర్తిగా విచారణ జరుపుతా. ఆ తర్వాత చర్యలు తీసుకుంటా.

# నిబంధనలకు పదును.. పంచాయతీలకు అదను



ఖమ్మం : ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇళ్ల స్థలాలు విక్రయించేందుకు వెంచర్లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల పాలిట కలెక్టర్ గౌతమ్ సింహస్వప్నంలా మారారు. ఎలాంటి ఒత్తిళ్లను లెక్క చేయక కచ్చితంగా నిబంధనలు అమలు చేస్తున్నారు. కొత్తగా వేసే వెంచర్ల నిర్వాహకులు కచ్చితంగా సంబంధిత శాఖల అనుమతులు తీసుకుంటున్నారు. వాటినీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రెండు, మూడు దశాబ్దాల కిందట వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించగా ఇప్పటికీ ఖాళీగా ఉన్న వాటిని గుర్తించి లెక్కలు తీయించారు. ఆయా వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన గ్రీన్ బెల్ట్ స్థలాలు స్వాధీనపరచుకొని గ్రామ పంచాయతీలకు అప్పగిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా సుమారు రూ.50 కోట్ల విలువైన గ్రీన్‌బెల్ట్ స్థలాలను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గ్రీన్‌బెల్ట్ స్థలాల్లో పల్లె ప్రకృతి వనాలు, పార్కులు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, రైతు వేదికలు నిర్మించగా మరికొన్ని ప్రాంతాల్లో కమ్యూనిటీ ప్లాంటేషన్ పేరుతో మొక్కలు నాటుతున్నారు.

అనధికారికంగా...గతంలో అనధికారికంగా రూపొందించిన వెంచర్ల వివరాలు సేకరించిన కలెక్టర్ ఆయా వెంచర్ల యజమానుల వివరాలు తహసీల్దార్లు, ఎంపీడీవోల ద్వారా సేకరించారు. ఆయా వెంచర్ల నుంచి గ్రీన్‌బెల్ట్ స్థలాలు స్వాధీనం చేసుకునేలా ఒత్తిడి పెంచారు. ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, చింతకాని మండలాల్లో అనధికారిక వెంచర్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ మండలాల్లో భూమి విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే రియల్ వ్యాపారులు గ్రీన్‌బెల్ట్ స్థలాలు ఇవ్వకుండా అప్పట్లో మేనేజ్ చేశారు. ఇది గ్రహించిన కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లాలో అనధికారిక వెంచర్లను గుర్తించి వాటి యజమానుల ముక్కుపిండి మరీ గ్రీన్‌బెల్ట్ స్థలాలు స్వాధీనం చేసుకుంటుండటం గమనార్హం.

ఇళ్ల స్థలాల విక్రయాలు, వెంచర్లకు ఆమోదం తెలిపి, డీటీసీపీ లేఅవుట్ అప్రూవల్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు అమల్లోకి తెచ్చింది. వాటిని కలెక్టర్ గౌతమ్ కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఈ తాజా నిబంధనల మేరకు జిల్లాస్థాయి లేఅవుట్ అప్రూవల్ కమిటీలో ఇప్పటి వరకు 111 గ్రామ పంచాయతీల్లో 1,070.23 ఎకరాల్లో వెంచర్లు వేసేందుకు అనుమతిచ్చారు. ఈ వెంచర్ల నుంచి 103.14 ఎకరాల గ్రీన్ బెల్ట్ స్థలం ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించారు. అధికారికంగా గ్రామ పంచాయతీలకు అప్పగించిన స్థలం విలువే రూ.50 కోట్ల పైగా ఉంటుందని అంచనా. తాజాగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు వెంచర్లకు అనుమతి ఇచ్చారు. వీటి నుంచి అత్యంత విలువైన గ్రీన్ బెల్ట్ స్థలం మున్సిపల్ కార్పొరేషన్‌కు దక్కనుంది.

పంచాయతీలకు విలువైన స్థలాలు

వింజం అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామ పంచాయతీలకు ఊహించని విధంగా అత్యంత విలువైన గ్రీన్‌బెల్ట్ స్థలాలు దక్కాయి. కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక చొరవ, తీసుకున్న చర్యల వల్ల అనధికారిక వెంచర్ల యజమానుల నుంచి విలువైన స్థలాలు పంచాయతీలకు వచ్చాయి. పచ్చదనం పెంచేందుకు ఆ స్థలాలను ఉపయోగిస్తున్నాం. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, హరితహారంలో మొక్కలు నాటేందుకు స్థలాలు వాడుతున్నారు. ఇటీవల కొత్తగా వెలుస్తున్న వెంచర్ల నుంచి వాటా మేరకు గ్రీన్‌బెల్ట్ స్థలాలు వచ్చాకే అనుమతులు మంజూరవుతున్నాయి.

# పనికి తగ్గ ప్రతిఫలమేదీ..?



ఖమ్మం : జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో మహిళల అభ్యున్నతికి పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఎంత కీలక భూమిక పోషిస్తుందో.. ఎస్‌ఆర్‌డీఎస్ (సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసు) ఉద్యోగులూ గ్రామీణ ప్రాంతాల్లో అదే మాదిరిగా వ్యవహరిస్తున్నారు. కూలీలకు పనులు కల్పించడం, సీసీరోడ్లు, శ్మశానవాటికలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పేదరిక నిర్మూలన సంస్థకు ప్రభుత్వం ఇటీవల పేస్కేల్, కేడర్ వర్తింపజేస్తూ ఉత్తర్వు విడుదల చేసి ఎస్‌ఆర్‌డీఎస్ ఉద్యోగులను విస్మరించిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల వారీగా..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్‌ఆర్‌డీఎస్ లేదా ఉపాధి హామీ పథకంలో ఏపీవోలు పదకొండు మంది, ఈసీలు– 16, టీఏలు– 94, సీవోలు– 38 మంది పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ 163 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఏపీవోలు–20, ఈసీలు–14, సాంకేతిక సహాయకులు–76, కంప్యూటర్ ఆపరేటర్స్–47, ప్లాంటేషన్ సూపర్‌వైజర్–1, ప్లాంటేషన్ మేనేజర్–1, హెచ్‌ఆర్ మేనేజర్–1, ఏపీడీ–1, కోర్స్ డైరెక్టర్–1, అడిషనల్ డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్–1 ఉన్నారు. ఎండాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతం. పొద్దున్నుంచి రాత్రి వరకు పనిచేస్తారు. రెండో శనివారాలు సైతం విధులు నిర్వర్తిస్తారు. పనులు గుర్తించడం దగ్గర నుంచి కూలీలకు డబ్బులు చేతికందే వరకు కీలకపాత్ర పోషిస్తారు.

ప్రభుత్వంపై అదనపు భారం పడదు..!

సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్, కేడర్ వర్తింపజేయడం వల్ల ప్రభుత్వంపై రూ.58 కోట్ల భారం పడుతోంది. అదే ఎస్‌ఆర్‌డీఎస్ ఉద్యోగులకు వర్తింపజేస్తే ఏ భారం పడదు. రాష్ట్రవ్యాప్తంగా 3,874 మంది ఉద్యోగులున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం లేబర్ అడ్మినిస్ట్రేషన్ ఎక్స్‌పెండేచర్స్ కింద ఆరు శాతం ఇస్తోంది. సుమారు ఏటా రూ.190 కోట్లు వస్తున్నాయి. వీటిని తమ పేస్కేల్‌కు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదని ఎస్‌ఆర్‌డీఎస్ ఉద్యోగులు చెబుతున్నారు.

ఆది నుంచి అవాంతరాలే..

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఏపీవోలు తొలుత ఐకేపీలో సీసీలుగా వ్యవహరించేవారు. ఉపాధిహామీ పథకం ప్రారంభించినప్పుడు పరీక్షలు రాసి ప్రోగ్రామ్ అధికారులుగా ఎంపికయ్యారు. ఎంపీడీవోలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రోగ్రామ్ అధికారులను కాస్త అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారులు(ఏపీవో)గా నియమించింది. ప్రోగ్రామ్ అధికారి బాధ్యతలను ఎంపీడీవోలకు అప్పగించింది. ఈజీఎస్‌లోకి అనవసరంగా వచ్చామని ఇప్పుడు ఏపీవోలు వాపోతున్నారు. తమతోపాటు పనిచేసిన సీసీలు ప్రస్తుతం ఏపీఎంలు, డీపీఎంల స్థాయి వరకు వెళ్లారని.. వారికి పేస్కేలు, కేడర్ వర్తిస్తుందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఐకేపీ ఉద్యోగుల మాదిరిగా తమకూ పేస్కేల్, కేడర్ వర్తింపజేయాలని కోరుతున్నారు.

2008లో ఉత్తర్వు–14 ప్రకారం ఎస్‌ఆర్‌డీఎస్‌కు హెచ్‌ఆర్(హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ పాలసీ) ఇచ్చారు. సెర్ప్ ఉద్యోగుల విన్నపంతో వారికీ హెచ్‌ఆర్ పాలసీ అమలుచేస్తున్నారు. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా ఎస్‌ఆర్‌డీఎస్ ఉద్యోగులకూ పేస్కేల్, కేడర్ వర్తింపజేయాలి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి మా కష్టాల్ని గుర్తించాలి.

ఏనుగు అంజిరెడ్డి, ఏపీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

# తగ్గుతున్న మిరప ధర

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మిరప ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. తేజ రకం క్వింటా మిరప ధర రూ.23 వేలు పలికింది. కనిష్ఠ ధర రూ.16 వేలు, నమూనా ధర రూ.20 వేలుగా నిర్ణయించారు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. అసలే దిగుబడి లేకపోవటం, దానికి తగ్గట్టు అకాల వర్షాలు పంటను దెబ్బతీసిన తరుణంలో ధరలు పడిపోతుండటం రైతన్నలకు ఆందోళన కలిగించే విషయం. ఈనెల 20వ తేదీన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రైతుల పక్షాన జెండా పాటలో పాల్గొన్నారు. ఆరోజు క్వింటా మిరప రూ.25,550 ఆల్‌టైమ్ రికార్డు ధర పలికింది. ఆరోజు నుంచి ధర నిలకడగా ఉంటుందని రైతులు భావించారు. కానీ ఈనెల 23న క్వింటా గరిష్ఠ ధర రూ.24,650 తగ్గింది. 24న రూ.24,000 కాగా రూ.23 వేలకు పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 40 వేల బస్తాల మిరప విపణికి వచ్చింది. ఛైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత మిరప కొనుగోళ్లను పరిశీలించారు.

# బ్యాంకులో కాదు.. సొంతానికి జమ

కరీంనగర్ : మహిళా సంఘాలు ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకొని బ్యాంకు లింకేజీ సంఘాలు, స్త్రీనిధి ద్వారా రుణాలు పొందుతూ ఆర్థికాభివృద్ధి వైపు ముందుకు సాగుతున్నాయి. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తుండగా.. కొందరు సంఘాలను నమ్మించి నెలనెలా వసూలు చేస్తున్న రుణ మొత్తాన్ని సొంతానికి వాడుకోవడం, బ్యాంకర్లు ఆ సంఘాలకు నోటీసులు ఇవ్వడంతో ఆలస్యంగా బయట పడుతున్నాయి. కరీంనగర్ నగర పాలక సంస్థ, మెప్మా పరిధిలో రెండేళ్ల కిందట బినామీ సంఘాలు ఏర్పాటు చేసుకొని పలు బ్యాంకుల ద్వారా రూ.కోట్లు తీసుకొని ఎగనామం పెట్టగా.. బాధ్యులైన మెప్మా ఒప్పంద ఉద్యోగులను, ఆర్పీలను తొలగించిన విషయం తెలిసిందే. ఈ విషయం మరవకముందే ఓ ఆర్పీ తీరు వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళ్లితే నగరంలోని పద్మశాలీ వీధిలో వసంతలక్ష్మి స్లమ్ సమాఖ్యలో 14 మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ఈ సంఘాలకు సంబంధించిన రుణాలను ప్రతి నెలా వసూలు చేసి బ్యాంకులో జమ చేయకుండా పెత్తనం చేసి ఆ మొత్తాన్ని ఓ ఆర్పీ సొంతానికి వాడుకున్నారు. రుణాన్ని వసూలు చేసి బ్యాంకులలో జమ చేయకపోవడం, ఆఫీసు బేరర్ల(ఓబీ)కు తెలియకుండా పోవడంతో అనుమానాలు వచ్చి ఆరా తీశారు. సంఘాలలో తీసుకున్న రూ.1,90,000, సమాఖ్యలోని రూ.2,96,627 వాడుకున్నట్లు తేలింది. అదేవిధంగా వెంకటేశ్వర సంఘంలోని బ్యాంకు లింకేజీ రూ.2.50 లక్షలు బ్యాంకులో కట్టాల్సి ఉంది. స్త్రీనిధి రూ.3 లక్షలు అప్పుగా అలాగే ఉంచడం, ఆ సంస్థ మేనేజర్ తెలుపడంతో సంఘ సభ్యులు ఆందోళన చెందారు. మరో సభ్యురాలు సంఘం నుంచి వైదొలగగా ఆ పేరు మీద రూ.50 వేలు రుణం తీసుకున్నట్లు సంఘ సభ్యులు వివరించారు.

తాఖీదులతో ఆందోళనసమాఖ్య పరిధిలో తీసుకున్న సంఘాలు బ్యాంకు ద్వారా రుణాలు సక్రమంగా చెల్లించడం లేదని, బకాయి పడిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఓ బ్యాంకు ఆ సమాఖ్యకు నోటీసులు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఆర్పీ నుంచి తీసుకున్న మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించే విధంగా చూడాలని కోరుతున్నారు. ఇలాగే ఇతర ప్రాంతాల నుంచి ఇటీవల కొన్ని ఫిర్యాదులు రాగా అధికారుల హెచ్చరికలతో రుణాలు చెల్లిస్తున్నారు.

కమిషనర్‌కు, పీడీకి ఫిర్యాదు

సమాఖ్య, సంఘంలోని సభ్యుల దగ్గర నుంచి ప్రతినెలా బ్యాంకులో చెల్లించాల్సిన రుణాన్ని తీసుకొని బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్న ఆర్పీపై వసంతలక్ష్మి సమాఖ్యకు చెందిన 14 సంఘాల సభ్యులు నగరపాలక కమిషనర్, మెప్మా పీడీకి ఫిర్యాదు చేశారు. సోమవారం నగర పాలక కార్యాలయానికి వచ్చి అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. మార్చి నెలాఖరు కావడంతో బ్యాంకర్లు, స్త్రీ నిధి అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని మొర పెట్టుకున్నారు. సీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టింపు లేకుండా పోయిందని, ఆర్పీ స్పందించడం లేదని ఆగ్రహించారు. సాయంత్రం వీరంతా ఏం చేయాలనే విషయంపై సమావేశాన్ని నిర్వహించినట్లు సమాచారం. రాష్ట్ర మంత్రి, మేయర్, కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమయ్యారు. చర్యలు తప్పవు – రాజేశ్వర్, సహాయ కమిషనర్, నగర పాలికసంఘాల సభ్యుల రుణాలను బ్యాంకులకు చెల్లించకపోతే కఠిన చర్యలు తప్పవు. ఫిర్యాదులు వస్తే విచారణ జరిపిస్తాం. సభ్యులు మొదట్లోనే అధికారుల దృష్టికి తేవాలి. ఆ సమయంలో రాకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయి.

# గొలుసుకట్టు.. మద్యం మత్తు

పెద్దపల్లి: జిల్లాలో కల్తీ మద్యం దందా జోరుగా సాగుతోంది. మద్యం దుకాణాల్లో నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న మద్యం వ్యాపారులు అక్రమదందాకు తెరతీస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి గ్రామాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. 24 గంటల్లో దుకాణ విక్రేతల నిద్ర సమయం మినహా వేళాపాళా లేకుండా కిరాణా దుకాణాల్లోనే అనధికారికంగా గొలుసు(బెల్ట్) దుకాణాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వైన్స్ దుకాణ యజమానులు అక్రమ నిల్వలు, అస్తవ్యస్తంగా ఆదాయ వ్యయాల నిర్వహణ, పర్మిట్ రూమ్‌లలో అధిక ధరలు, పండగ, ప్రత్యేక రోజుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరల్లో విక్రయాలు చేస్తున్నారు. ప్రముఖ మద్యం బ్రాండ్లకు సంబంధించిన బాటిళ్లను తెరిచి అందులో నీరు పోసి తిరిగి యథావిధిగా ప్యాకింగ్ చేస్తూ కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు చిత్తు

ఆబ్కారీ, పోలీసు శాఖల అధికారులకు ప్రతి మద్యం దుకాణం నుంచి నెలనెలా మామూళ్లు వెళుతుండటంతోనే దర్జాగా కల్తీ మద్యం దందా, బెల్ట్ దుకాణాల నిర్వహణ చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మద్యం దుకాణదారులు ప్రత్యేక సెలవు దినాల్లోనూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా.. ఈ యంత్రాంగం తనిఖీలు చేయడం లేదు. మద్యం గ్రామాల్లో ఎప్పుడుపడితే అప్పుడు లభిస్తుండటంతో చాలా మంది సంపాదించిన డబ్బును మద్యం కొనుగోళ్లకు ఖర్చు చేస్తున్నారు. డబ్బు లేకపోతే ఇంట్లో ఉండే వస్తువులు విక్రయించి తాగుడుకు బానిసవుతున్నారు.

మద్యం దుకాణాల టెండర్లు 2021 సంవత్సరం నవంబర్‌లో నిర్వహించారు. ఇదే ఏడాది డిసెంబర్ 1 నుంచి 77 దుకాణాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. గొలుసు దుకాణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వ పరంగా వీటికి అనుమతులు కూడా అవసరం లేకుండా పోవడంతో విచ్చలవిడిగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం నిల్వలతో కలిపి కల్తీ చేస్తూ మద్యం విక్రయిస్తున్నారు. రాత్రయ్యిందంటే మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. వీరి ఆగడాలతో పరస్పరం గొడవలు నిత్యకృత్యమవుతున్నాయి.

నిర్వాహకులు ఏకంగా పెద్దపల్లిలోని మద్యం దుకాణాల నుంచి కల్తీ మద్యాన్ని తీసుకెళ్లి మారుమూల ప్రాంతాల్లో ఉండే తమ గొలుసు దుకాణాల్లో విక్రయిస్తున్నప్పటికీ ఏమీ తెలియనట్లుగా ఆబ్కారీ పోలీసులు తనిఖీలు చేయకుండా ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో తమ గొలుసు దుకాణాల సంఖ్యను పెంచేందుకు వ్యాపారులు అన్నీ వనరులు సిద్ధం చేసుకుంటున్నారు.

ఇక్కడివారు పట్టించుకోక..గత ఏడాది మార్చిలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ మద్యం దుకాణంలో ఆకస్మికంగా హైదారాబాద్ ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ పోలీసుల బృందం తనిఖీలు చేసి ప్రముఖ బ్రాండ్లకు సంబంధించిన మద్యం నమునాలను సేకరించి ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించారు. మద్యంలో నీళ్లు, ఇతరత్రా తక్కువ ధరలకు వచ్చే చీప్‌లిక్కర్ వంటివి కలుపుతూ కల్తీకి పాల్పడుతున్నట్లు వారి పరీక్షల్లో తేలింది. వెంటనే ఆ మద్యం దుకాణాన్ని సీజ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇలాగే మద్యం దుకాణాల్లో పెద్దఎత్తున కల్తీలు జరుగుతున్నట్లు పలుమార్లు జిల్లా ఆబ్కారీశాఖకు ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు మామూళ్ల 'మత్తు'లో పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.



# ఈడీ.. ప్రతీకార చర్యలకు పాల్పడొద్దు..!

దిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేసుల దర్యాప్తుల సమయంలో ఈడీ ప్రతీకార చర్యలకు పాల్పడకూడదని, చట్టప్రకారం వ్యవహరించాలని సూచించింది. గురుగ్రామ్‌కు చెందిన ఎం3ఎం కంపెనీపై మనీలాండరింగ్ కేసులో ఆ కంపెనీ డైరెక్టర్లు బసంత్ బన్సల్, పంకజ్ బన్సల్ అరెస్టును కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఓ అవినీతికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎం3ఎం డైరెక్టర్లు బసంత్ బన్సల్, పంకజ్ బన్సల్‌పై ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే జూన్ 1వ తేదీన ఈడీ అధికారులు ఎం3ఎం గ్రూప్, బన్సల్ సోదరుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిపారు. దీంతో వీరు జూన్ 9న పంజాబ్–హరియాణా హైకోర్టును ఆశ్రయించగా.. జులై 5 వరకు వారికి అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పించింది. అయితే, జూన్ 14న వారిని ఈడీ అరెస్టు చేసింది. ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో కస్టడీలోకి తీసుకుంది. ఈ అరెస్టును సవాలు చేస్తూ బన్సల్ సోదరులు పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించగా.. వారి పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కోర్టు వేసింది. దీంతో వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపి వీరికి బెయిల్ మంజూరు చేసింది. ఆ ఉత్తర్వుల కాపీ తాజాగా బయటికొచ్చింది. కాగా.. విచారణ సమయంలో ఈడీ అధికారుల చర్యలపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "ఈడీ ప్రతి చర్య పాదర్శకంగా, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. కానీ, ఈ కేసులో దర్యాప్తు సంస్థ తన అధికారాలను, విధులను అనుసరించడంలో విఫలమైనట్లు తేలింది. ఈడీ ప్రతీకారపూరిత చర్యలకు పాల్పడకూడదు. అత్యంత పారదర్శకంగా, న్యాయంగా వ్యవహరించాలి. ఈడీ అడిగిన ప్రశ్నలకు నిందితులు సమాధానాలు చెప్పలేదన్న కారణంతో వారిని అరెస్టు చేయడం సరికాదు. మనీలాండరింగ్ చట్టం కింద వారు నేరానికి పాల్పడ్డారని చెప్పేందుకు కచ్చితమైన ఆధారాలను సేకరించి అరెస్టు చేయాలి. అంతేగానీ, సమన్లకు సరిగా స్పందించలేదని ఎవరినీ అరెస్టు చేయకూడదు. అంతేగాక, అరెస్టు సమయంలో అందుకు గల కారణాలను కూడా నిందితులకు లిఖితపూర్వకంగా అందించాలి" అని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ కేసులో బన్సల్ సోదరుల అరెస్టు చట్ట వ్యతిరేకమన్న ధర్మాసనం.. వారిని తక్షణమే విడుదల చేయాలని ఈడీని ఆదేశించింది.



# అత్యాధునిక ఫీచర్లతో వందే భారత్ స్లీపర్ కోచ్‌లు

## వందే భారత్‌లో స్లీపర్ కోచ్‌లు.. ఫొటోలు షేర్ చేసిన కేంద్ర మంత్రి

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను క్రమంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 వందే భారత్ రైళ్లు పట్టాలపై పరుగులు తీస్తున్నాయి. త్వరలో వీటి సంఖ్య మరింత పెంచాలని కేంద్రం భావిస్తోంది. వీటికి అదనంగా 2024 మార్చినాటికి వందే భారత్‌లో స్లీపర్ కోచ్‌లను తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే వీటి లోపలి డిజైన్‌ను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కాన్సెప్ట్ ట్రైన్ – వందే భారత్ (స్లీపర్ వెర్షన్) 2024లో రాబోతున్నాయి" అంటూ ఫొటోలను ట్వీట్ చేశారు. ఈ స్లీపర్ కోచ్‌లను అత్యాధునిక ఫీచర్లతో డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రతి రైలులో 857 బెర్తులు ఉంటాయి. వీటిలో 823 ప్రయాణికుల కోసం కాగా, 37 బెర్తలను సిబ్బందికి కేటాయించనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి కోచ్‌లో నాలుగు కాకుండా మూడు టాయ్‌లెట్లు ఉంటాయి. ఒక మినీ ప్యాంట్రీ ఉంటుంది. వందేభారత్ స్లీపర్ కోచ్‌లలో దివ్యాంగులకు అనువుగా ఉండేందుకు ర్యాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ కోచ్‌లలో బెర్తులు మరింత వెడల్పుగా ఉండనున్నాయి. ప్రయాణికులు సులభంగా పై బెర్తుకు చేరుకునేందుకు వీలుగా వీటిని డిజైన్ చేశారు.



# కేబినెట్ ఆమోదం పొందాకే అమల్లోకి సీమెన్స్ ప్రాజెక్టు

విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్, సీఐడీ కస్టడీ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో విచారణ ప్రారంభమైంది. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబె వాదనలు వినిపించారు. "స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు వైపు ఎలాంటి తప్పిదాలు లేవు. అప్పటి ఆర్థికశాఖ ఉన్నతాధికారి సునీత గుజరాత్ వెళ్లి అధ్యయనం చేశారు. ఆమె అధ్యయనం చేశాక సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. ఎలాంటి అభ్యంతరం లేకుండా ప్రాజెక్టు ఆమోదం పొందిందన్న ఆధారాలు ఉన్నాయి. కాస్ట్ ఎవాల్యుయేషన్ కమిటీ స్కిల్ ప్రాజెక్టు ఎక్విప్‌మెంట్ ధరను నిర్ధారించింది.

ఆ కమిటీలో చంద్రబాబు లేరు. కమిటీలో ఉన్న భాస్కరరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. సుప్రీంకోర్టు నవంబర్ 16 వరకు ఆయన బెయిల్‌ను పొడిగించింది. చంద్రబాబుకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేసి ఆ తర్వాత విచారణ చేపట్టారు. రెండు రోజులు కస్టడీలోనూ విచారించారు. ఇప్పుడు మళ్లీ కస్టడీ కావాలంటున్నారు.. ఆ అవసరం ఏముంది? కేబినెట్ ఆమోదం పొందాకే సీమెన్స్ ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది. కేబినెట్ నిర్ణయం తీసుకుంటే చంద్రబాబుపై కేసు ఎలా పెడతారు?" అని ప్రమోద్‌కుమార్ దూబె వాదించారు.



# మెరుపు వరదలు.. 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతు..!

గ్యాంగ్‌టక్: ఈశాన్య రాష్ట్రం సిక్కింలో ఆకస్మిక వరదలు సంభవించాయి. నిన్న రాత్రి కురిసిన కుండపోత వర్షానికి లాచెన్ లోయలో గల తీస్తా నది ఉప్పొంగడంతో ఈ వరదలు చోటుచేసుకున్నాయి. ఇందులో 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతైనట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు ప్రాంతంలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో తీస్తా నది నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. అదే సమయంలో చుంగ్‌థాంగ్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఫలితంగా దిగువ ప్రాంతంలో నీటిమట్టం 15–20 అడుగుల మేర పెరిగింది. దీంతో అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఈ మెరుపు వరదలు సంభవించాయి. వరదల తీవ్రతకు లాచెన్ లోయలోని ఆర్మీ పోస్టులు నీట మునిగాయి. సింగ్తమ్ ప్రాంతంలో ఆర్మీ వాహనాలు కొట్టుకుపోయాయి. అందులోని 23 మంది సిబ్బంది గల్లంతైనట్లు ఈస్ట్రన్ కమాండ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. 41 వాహనాలు నీటమునిగినట్లు తెలిపింది. గల్లంతైన సిబ్బంది కోసం గాలింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. వరదలు సంభవించిన ప్రాంతంలో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేదు. దీంతో అక్కడి ఆర్మీ సిబ్బందిని కమాండ్ స్థాయి అధికారులు సంప్రదించడం కష్టంగా మారిందని సైనిక వర్గాలు వెల్లడించాయి. ఇక తీస్తా నది ఉగ్రరూపం దాల్చడంతో సింగ్తమ్ ఫుట్ బ్రిడ్జ్ కుప్పకూలింది. అటు పశ్చిమ బెంగాల్, సిక్కింను కలిపే 10వ నంబరు జాతీయ రహదారి చాటా చోట్ల కొట్టుకుపోయింది. మెరుపు వరదలతో అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రహదారులు నీటమునిగాయి. వరదలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ స్పందించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి.. అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అటు తీస్తా నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.

## తిరుమల: రాతిమండపాలపై అసత్య ప్రచారం.. చట్టపరమైన చర్యలుంటాయన్న టీటీడీ



తిరుపతి: తిరుమల అలిపిరి మెట్లమార్గంలో భక్తులు విశ్రాంతి తీసుకునే రెండు రాతి మండపాల్లో ఒకటి శిథిలావస్థకు చేరుకుందని తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ఏ.వీ. ధర్మారెడ్డి తెలిపారు. కుడి వైపు ఉన్న రాతి మండపం రిపేరు చేయడానికి కూడా వీలు లేకుండా శిథిలావస్థకు చేరుకుందని వెల్లడించారు. రాతి మండపం రాళ్ళు పునర్నిర్మాణం చేస్తామని స్పష్టం చేశారు. ఇదే కాకుండా శిథిలావస్థకు చేరిన తిరుమలలోని పార్వేట మండపాన్ని కూల్చి పునర్నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన రాతి మండపాలపై సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఈవో ధర్మారెడ్డి మండిపడ్డారు. 16వ శతాబ్దంలో సాళువ నరసింహరాయులు నిర్మాణం చేసిన.. రాతి మండపాలను యథావిధిగా రూ. 1.36 లక్షలు వెచ్చించి 20 పిల్లర్లతో పునర్ నిర్మాణం చేస్తున్నామని స్పష్టం చేశారు. దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నడక మార్గంలో చిరుతలు సంచారం తగ్గిన నేపథ్యంలో ఆంక్షలు సడలించామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఘాట్ రోడ్ లో ద్విచక్ర వాహనాలు రాత్రి పది గంటల వరకు అనుమతిస్తున్నామని వెల్లడించారు. కంచె నిర్మాణంపై వైల్డ్ లైఫ్ అధికారులు రిపోర్ట్ ఇంకా ఇవ్వలేదని అన్నారు.

అటవి జంతువుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచామని, సి.సి కెమెరాలుతో పాటు ట్రాప్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు.



# తెదేపా మహిళలను దూషిస్తే కేసులు ఉండవా?

## మహానటి రోజా నిన్న కార్చిన కన్నీరంతా డ్రామా.. అన్నీ గ్లిజరిన్ ఏడుపులే

విశాఖ : మహానటి రోజా నిన్న కార్చిన కన్నీరంతా డ్రామా అని.. అన్నీ గ్లిజరిన్ ఏడుపులేనని తెలుగు మహిళా అధ్యక్షురాలు అనితా పేర్కొన్నారు. రోజా తన పూర్వ వీడియోలు ఒకసారి చూడాలని.. అప్పుడు ఆమె ఏం మాట్లాడిందో తెలుస్తుందన్నారు. ఆడదానివన్న సంగతి ఇప్పుడు గుర్తొచ్చిందా? అని రోజాను ప్రశ్నించారు. "రాష్ట్రంలో ఆడ పిల్లలు మాన ప్రాణాలు పోతున్నా ఎవరూ స్పందించలేదు. ప్రతిపక్షంలో ఉన్నపుడు రోజా మద్యం బాటిల్స్ బద్దలు కొట్టింది. ఇపుడు ఏరులై పారుతున్నా ఎందుకు స్పందించడం లేదు? సామాజిక మాధ్యమాల్లో ఉన్న విషయాన్ని బండారు సత్యనారాయణ మాట్లాడారు. నా గురించి రోజా చాలా నీచంగా మాట్లాడారు.

అంత కన్నా నీచంగా బండారు మాట్లాడారా? నేను ఎన్నో కేసులు పెట్టినా అయినా పోలీసులు స్పందించలేదు. ఇపుడు చీటికీ మాటికి మాపై కేసులు పెడుతున్నారు. బ్రాహ్మణి గారికి జడలుకు వేశానని చెప్పావు.. ఇప్పుడు విమర్శలా? భువనేశ్వరి కాళ్ళు పట్టుకోలేదా? భువనేశ్వరిపై విమర్శలు చేస్తున్నపుడు.. నువ్వు నవ్విన నవ్వు మేము ఎప్పుడూ మర్చిపోము. బాబు జైలుకు వెళ్ళినప్పుడు స్వీట్లు పంచుకుంటావా? రోజా.. నీకు రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీయే. బాబుని కామ సిఎం అని రోజా మాట్లాడలేదా? భువనేశ్వరి, బ్రాహ్మణి, లోకేష్ మీద అవాకులు చెవాకులు పేలలేదా? రోజా, భారతీ రెడ్డి గురించి మాట్లాడితే... మా ఇంటికి పోలీసులు వస్తారు. వాళ్ళు మాట్లాడితే నో పోలీస్. యూట్యూబ్‌లో ఉన్న వాటిని తీయంచుకోవాలని రోజాకి సలహా ఇస్తున్నాం" అని అనిత పేర్కొన్నారు.

# పవన్‌కు కృష్ణా జిల్లా ఎస్పీ నోటీసులు



అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా నోటీసులు ఇచ్చారు. పెడన వారాహి యాత్రలో దాడులు చేస్తారని.. దీనిపై విశ్వసనీయ సమాచారం ఉందని మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో పవన్ వ్యాఖ్యలు చేశారు.

ఈనేపథ్యంలో దాడులపై సమాచారం ఉంటే ఇవ్వాలని పవన్‌కు జిల్లా ఎస్పీ నోటీసులు జారీ చేశారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని ఎస్పీ చెప్పారు. పెడనలో వారాహి యాత్రకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# అందుకే హడావుడిగా సీఎం జగన్ ఢిల్లీ వెళ్తున్నారు

అమరావతి: ఫైబర్ గ్రిడ్ కేసులో నారా లోకేష్‌కు సంబంధం లేదని నిన్న న్యాయస్థానంలో ప్రభుత్వమే క్లీన్ చిట్ ఇచ్చిందని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఫైబర్ గ్రిడ్‌లో కుంభకోణం అంటూ ఎన్నో ఆరోపణలు చేసిన వైకాపా నేతలు..., నిన్న న్యాయస్థానంలో ప్రభుత్వ వాదనలతో కేసు డొల్లతనం బహిర్గతమైందన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు కోసం అక్రమ కేసులు పెడుతోందన్నది స్పష్టమైదన్నారు. ఎన్నికల వరకూ చంద్రబాబును జైల్లో ఉంచాలని జగన్మోహన్ రెడ్డి తాపాత్రయపడుతున్నారని, అందుకే హడావుడిగా గురువారం ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్తున్నారని అన్నారు. చంద్రబాబు అరెస్టు భాజపాకు తెలిసి జరిగిందా?.. తెలియక జరిగిందా? అనేది దేవుడికే తెలియాలని, బాబు అరెస్టు అక్రమమని తెలిసి కూడా భాజపా నేతలు కనీసం స్పందించకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతోందని అచ్చెన్నాయుడు అన్నారు. ఈ నెల 9వ తేదీలోపు చంద్రబాబు బయటకు వస్తారని యోచిస్తున్నామన్నారు. బాబుతో నేను ఇంటింటి ప్రచారం, రిలే నిరాహారదీక్షలు ఈ నెల 9వ తేదీ వరకూ కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు బయటకు వచ్చే ప్రక్రియ ఇంకా ఆలస్యమవుతుంటే, 10వ తేదీ నుంచి వివిధ రూపాల్లో నిరసనలకు కొత్త కార్యక్రమం చేపడతామని చెప్పారు. చంద్రబాబు అరెస్టుతో మనోవేదనకు గురై దాదాపు 120 మంది చనిపోయారన్నారు. చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించాలని భువనేశ్వరి ఇప్పటికే నిర్ణయించారని, ఆమెతోపాటు పార్టీ నేతలు వివిధ రూపాల్లో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను చేపడతారని, కోర్టు పరిణామాలు బట్టి 10వ తేదీన నిర్ణయిస్తామని తెలిపారు. నారా లోకేష్ కూడా ఈ వారంలో చంద్రబాబుతో ములాఖత్ అవుతారన్నారు.

జనసేనతో సమన్వయం కోసం 5గురు సభ్యుల కమిటీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతానికి జనసేనతో మాత్రమే పొత్తులో ఉన్నామని, వామపక్ష పార్టీలతో పొత్తు అంశం అధినేత చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు. చంద్రబాబు అరెస్టుతో పార్టీ కార్యక్రమాలు ఏవీ స్తంభించలేదని, ఓట్ల అక్రమాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు.

# వివేకా హత్య కేసు విచారణ మరోసారి వాయిదా



హైదరాబాద్/అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసు విచారణను సీబీఐ కోర్టు ఈనెల 16కు వాయిదా వేసింది. కేసు విచారణలో భాగంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోర్టుకు వచ్చారు. అలాగే వివేకా హత్య కేసులో అరెస్ట్ అయిన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, మనోహర్‌లను పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. మరోవైపు వివేకా హత్య కేసులో కడప ఎంపీ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి ఎస్కార్ట్ బెయిల్‌ను సీబీఐ కోర్టు అక్టోబర్ 10 వరకు పొడిగించింది.

నిన్నటితో భాస్కర్‌రెడ్డి మధ్యంతర బెయిల్ ముగిసింది. తన ఆరోగ్యం కుదుట పడలేదని మరికొంత సమయం కావాలంటూ కోర్టును భాస్కర్‌రెడ్డి కోరారు. దీంతో భాస్కర్ రెడ్డికి మరో ఏడు రోజుల పాటు ఎస్కార్ట్ బెయిల్‌ను సీబీఐ కోర్టు మంజూరు చేసింది.

# వచ్చేది డైనోసార్ ధనుష్.. రిస్క్ వద్దు!

ఈ ఏడాది మిగిలిపోయిన మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో ప్రభాస్ సలార్ – షారుక్ డంకీ. డిసెంబర్ మూడో వారంలో ఇవి రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. సినీ ప్రియుల దృష్టంతా ఈ రెండు చిత్రాల మీదే ఉంది. దీంతో ఈ రెండు చిత్రాలకు అటు ఇటు కొద్ది రోజుల వరకు ఏ సినిమాలు వచ్చేందుకు సాహసం చేయవు! కానీ ధనుశ్? పాన్ ఇండియా మూవీ కెప్టెన్ మిల్లర్ మాత్రం విడుదల సాహసానికి సిద్ధంగా ఉంది. డిసెంబర్ 15న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



వాస్తవానికి ఈ చిత్రం విడుదల తేదీని ఎప్పుడో అనౌన్స్ చేశారు. అప్పటికీ షారుఖ్ ఖాన్ డంకీ మాత్రమే డిసెంబర్ రిలీజ్‌కు కన్ఫార్మ్ అయ్యింది. బాలీవుడ్ చిత్రం కావడంతో మిల్లర్ మేకర్స్.. పెద్ద పోటీగా భావించలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. అనూహ్యంగా సలార్ వచ్చి డిసెంబర్ మూడో వారానికి చేరింది. పైగా రీసెంట్‌గానే జవాన్‌తో మరో రూ.1000కోట్ల హిట్‌ను అందుకున్నారు షారుక్. అంటే ఇప్పుడు సలార్ – డంకీకి విపరీతమైన క్రేజ్ నెలకొని ఉంది. మరి ఇలాంటి సమయంలో కేవలం వారం రోజుల వ్యవధిలో ముందుగా వచ్చి.. మిల్లర్.. పైసా వసూలు చేయడం సాధ్యమేనా అంటే చెప్పడం కాస్త కష్టమే. గతంలో… 2018 డిసెంబర్‌లో ధనుశ్ 'మారి 2' రిలీజ్ చేసినప్పుడు.. అప్పుడు పోటీగా.. షారుక్ ఖాన్ జీరో, యష్ కేజీయఫ్ ఛాప్టర్ 1, మోహన్ లాల్ ఒడియన్, అక్వమెన్ వంటివి ఉన్నాయి. అయినా కూడా 'మారి 2' కమర్షియల్?గా మంచి సక్సెస్?ను అందుకుంది. ఇప్పుడు కూడా అలాంటి సీన్ రిపీట్? అవుతుందనే ధీమాతో సినిమా రిలీజ్? చేస్తే.. కష్టమే! ఎందుకంటే ఈ సారి పోటీగా వచ్చేది డైనోసార్. తక్కువ అంచనా వేయలం. కాబట్టి.. మిల్లర్ ఫైనల్ డెసిషన్? చాలా క్యాలికులేషన్లపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఢీ కొట్టేందుకు రెడీ అయిందా.. తమిళంలో ఓకే కానీ ఇతర భాషల్లో కష్టాలు తప్పవు. ఇకపోతే ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రియాంకా మోహన్ హీరోయిన్, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే రిలీజైన టీజర్ ఆకట్టుకుంది.

# సితారతో బేబీ ఒప్పందం

బేబీ చిత్రంతో టాలీవుడ్ కి హీరోయిన్ గా పరిచయం అయిన అందాల భామ వైష్ణవి చైతన్య. ఈ తెలుగమ్మాయి మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది. దాంతో ఒక్కసారిగా స్టార్ ఇమేజ్ వచ్చేసింది. సినిమా సూపర్ హిట్ కావడంతో పెద్ద పెద్ద ప్రొడక్షన్స్ నుంచి వైష్ణవికి ఆఫర్స్ వస్తూ ఉండటం విశేషం. ఆమె నెక్ట్స్ సినిమాకి సంబంధించిన అప్డేట్స్ అయితే ఇప్పటి వరకు లేవు. కానీ ఇప్పటికే మైత్రీ మూవీ మేకర్స్ లో ఒక సినిమా చేయడానికి అగ్రిమెంట్ చేసుకుందంట. అలాగే దిల్ కూడా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా కోసం వైష్ణవి చైతన్యని హీరోయిన్ గా తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. అఫీషియల్ గా అయితే ఇంకా ఈ ప్రాజెక్ట్ ఎనౌన్స్ కాలేదు. ఇప్పుడు సితార ఎంటర్టైన్మెంట్స్ నాగ వంశీ కూడా ఒక సినిమా కోసం వైష్ణవి చైతన్యని తీసుకునే ఆలోచనలో ఉన్నారంట. ఇలా మూడు పెద్ద బ్యానర్స్ లో మూడు సినిమాలు చేయడానికి వైష్ణవి చైతన్య ఒప్పందం చేసుకోవడం నిజంగా



తెలుగమ్మాయిలకి ఒక శుభవార్త అని చెప్పొచ్చు. గత రెండు దశాబ్దాల నుంచి చూసుకుంటే టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ రేంజ్ ఇమేజ్ సొంతం చేసుకొన్న అందాల భామలు ఒకరిద్దరు కనిపిస్తారు. వారు కూడా స్టార్ హీరోల చిత్రాలలో అవకాశాలు సొంతం చేసుకోలేకపోయారు. అయితే వైష్ణవి చైతన్య ఆ ట్రెండ్ ని బ్రేక్ చేసి స్టార్ హీరోయిన్ రేంజ్ అందుకోవడంతో పాటు పెద్ద సినిమాలలో అవకాశాలు సంపాదించేలా కనిపిస్తోంది. దిల్ రాజు బ్యానర్ లో కమిట్ అయిన మూవీ త్వరలో అఫీషియల్ గా ఎనౌన్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి బేబీ భామకి ఇంకెన్ని ప్రొడక్షన్ హౌస్ లో కొత్త సినిమాల కోసం క్యూ కడతాయో అనేది చూడాలి. ఈ పెద్ద బ్యానర్స్ లోనే కాకుండా సాయి రాజేష్ కూడా మరో మూడు చిత్రాలు వైష్ణవితో చేయడానికి అగ్రిమెంట్ చేసుకున్నట్లు గతంలోనే ప్రకటించారు. వాటిలో కొత్త సినిమా ఏదైనా స్టార్ట్ అవుతుందేమో చూడాలి.




# 50 వయసు ఐశ్వర్యారాయ్‌పై ఆ కామెంట్లు ఏంటి?



వయసు 50కి చేరువవుతున్నా ఐష్ లో జోష్ ఏమాత్రం తగ్గలేదు. దాదాపు 20ఏళ్ల క్రితం మోడలింగ్ రోజుల్ని ఇప్పటికీ గుర్తు చేస్తోంది. బాలీవుడ్ సూపర్ స్టార్ ఐశ్వర్య రాయ్ బచ్చన్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో తళుక్కున మెరిసారు. లోరియల్ ప్యారిస్ కోసం ర్యాంప్ వాక్ చేస్తున్నప్పుడు అందరి కళ్లు ఐష్ సొగసు పైనే. గోల్డెన్ కేప్ గౌనులో రన్‌వేపైకి దూసుకెళ్లిన ఐష్ ఎంతో అద్భుతంగా కనిపించింది. వాక్ యువర్ వర్త్ పేరుతో బ్రాండ్ షో కోసం ర్యాంప్‌పై నడిచిన కెండల్ జెన్నర్, ఎవా లాంగోరియా, హెలెన్ మిర్రెన్, వియోలా డేవిస్ లతో పాటు ఐశ్వర్య కూడా ఉన్నారు. ఐశ్వర్య లుక్‌కి ఇంటర్నెట్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. ఐశ్వర్య అభిమానులు తన నడక తీరు కాన్ఫిడెన్స్ గురించి ముచ్చటపడుతుండగా, వారిలో కొందరు ఐష్ ఎంచుకున్న అందమైన దుస్తులను ఇష్టపడుతున్నారు. ఇంటర్నెట్‌లోని ఒక విభాగం ఆమె ముఖం చాలా నిండుగా కనిపించింది అని వ్యాఖ్యానించారు. "ఆమె తన జుట్టును ఇలాగే స్టైలింగ్ చేయాలి. ఆమె చాలా బాగుంది" అని ఐష్ కురుల గురించి వర్ణించారు. మరొకరు ఇలా అన్నారు, "ఐష్ సైడ్ పార్ట్ అందమైన పెదవులు ఎంత మెరుగ్గా ఉన్నాయో.. నేను దానిని ఎందుకు గ్రహించలేదో తెలియదు. కొంతకాలంగా ఐష్ ప్రదర్శనల్లో ఇదే ఉత్తమమైనది. స్టైలింగ్ పాయింట్‌లో ఉంది. ఆమె క్వీన్ అని పొగిడేశాడు. అయితే, కొంతమంది ఐశ్వర్య లుక్‌ని విమర్శించారు. "నా కళ్ళు నమ్మడం లేదు. ఐష్ ముఖానికి ఏమైంది?అని ఒక నెటిజన్ వ్యాఖ్యానించాడు. తన ముఖం నిండుగా కనిపిస్తోంది. ఆమె శరీర ఆకృతికి ఈ దుస్తులు ఎంపిక చేయడం పూర్తిగా తప్పు. తనకు ఇలా చేసిన మొత్తం టీమ్‌ను తొలగించాలి" అని మరొకరు అన్నారు. ఐశ్వర్య రాయ్ తన కుమార్తె ఆరాధ్య బచ్చన్ తో కలిసి శనివారం పారిస్ ఫ్యాషన్ వీక్ కోసం బయలుదేరారు. ఫోటోగ్రాఫర్లు షేర్ చేసిన వీడియోలో.. ఆరాధ్య ఇప్పుడు తన తల్లిలా పొడవుగా ఉందని ఐష్ స్వయంగా ఉత్సాహం కనబరిచింది. 'ఆరాధ్య ఇప్పుడు నా ఎత్తు' అని ఉద్వేగభరితంగా ఐశ్వర్య చెప్పడం వీడియోలో కనిపించింది. ఆరాధ్య ఎంతో ఎగ్జయిట్ అవుతూ కనిపించింది.

ఆ సన్నివేశానికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. మణిరత్నం పొన్నియన్ సెల్వన్1,2 భాగాల్లో నటించిన ఐశ్వర్యారాయ్ తదుపరి ప్రాజెక్టును ఇంకా ప్రకటించలేదు. అలాగే తన అంత ఎదిగేసిన ఆరాధ్యబచ్చన్ నటనలోకి ప్రవేశిస్తుందా లేదా? అన్నదానిపైనా ఐష్ ఇంకా క్లారిటీనివ్వలేదు.

# 'యారియాన్ 2' ట్రైలర్: ఆ ఎమోషన్స్ ఏమయ్యాయి?




ఒక అందమైన అమ్మాయి.. ఆ అమ్మాయి జీవితంలో ఇద్దరు అబ్బాయిలు! ఆ ఇద్దరూ ఒకరికొకరు స్నేహితులు అయితే ఆ తర్వాత స్టోరీలో మజా ఏమిటన్నదే ఈ ట్రైలర్ థీమ్. ఆ ముగ్గురి ప్రేమకథల్లో ఉన్న ట్విస్టులేమిటన్నది తెరపైనే చూడాలి. తాజాగా రిలీజైన 'యారియన్ 2' ట్రైలర్ చూడగానే ముగ్గురి చుట్టూ తిరిగే ఆసక్తికర సినిమా ఇదని అర్థమవుతోంది. ట్రైలర్ ఆద్యంతం కలర్ ఫుల్ విజువల్స్ ఆకట్టుకుంటున్నా కానీ, ఈ సినిమా బెంగళూరు డేస్ పోలికలతో కనిపించడంతో .. ఆ స్థాయిలో ఈ రీమేక్ అలరిస్తుందా? అంటూ డిబేట్లు స్టార్టయ్యాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ మాతృకకు ధీటుగా లేదనేది అభిమానుల వాదన. నిజానికి బెంగళూరు డేస్ (కన్నడ సినిమా) కథలో ఎమోషన్స్ టింజ్ మరో లెవల్లో వర్కవుటయ్యాయి. కానీ అంత సీన్ తాజాగా యారియాన్ 2 ట్రైలర్ లో కనిపించడం లేదు. ఈ ట్రైలర్ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. అంజలి మీనన్ ఒరిజినల్ గా బెంగళూర్ డేస్ కి దర్శకత్వం వహించారు. తమిళంలో పేరు మార్పుతో విడుదలైంది. కానీ ఇప్పుడు హిందీలో అదే సినిమా స్ఫూర్తితో యారియాన్ 2 వస్తోంది. అయితే ఇది ఏమేరకు యూత్ ని థియేటర్లకు రప్పిస్తుందో వేచి చూడాలి. యారియాన్ 2 లో దివ్య ఖోస్లా కుమార్, మీజాన్ జాఫ్రీ, యష్ దాస్‌గుప్తా నటించారు, వీరు మొదట ఫహద్ ఫాసిల్, నజ్రియా నజీమ్, దుల్కర్ సల్మాన్ పోషించిన పాత్రల్లో నటించారు. రాధికా రావు, వినయ్ సప్రు దర్శకత్వంలో యారియన్ 2 రూపొందుతోంది. చిత్రం విడుదల అక్టోబర్ 10 న విడుదల కానుంది.

**ఆ ముగ్గురి ప్రేమకథల్లో ట్విస్టు..** యారియాన్ 2 ట్రైలర్ లో త్యాగం నిజాన్ని దాచడానికి ప్రయత్నించే డైలాగ్ లు ఆసక్తికరమే. నువ్వు త్యాగం చేసి నిజాన్ని దాచిపెట్టాలి కాబట్టి కిసి కో బురా నా లాగే. కయీ బార్ ఏక్ దోస్త్ కి కహీ చీజ్ దుస్రే దోస్త్ కో నహీ కహీ జాతి, అందుకే దుస్రే దోస్త్ కో బురా నా లాగే (ఎవరూ బాధపడకూడదు. చాలా సార్లు, ఒక స్నేహితుడు మీకు ఏదైనా చెబితే మేం దానిని ఇతరులతో షేర్ చేయము.

అతను/ఆమె చెడుగా భావించకుండా ఉండటానికి.. అంటూ చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. యారియాన్ 2 ట్రైలర్ దివ్య పాత్ర లాడ్లీని పరిచయం చేయడం ద్వారా ప్రారంభమవుతుంది. యష్ దాస్‌గుప్తా డేరింగ్ క్యారెక్టర్, శిఖర్ ,పెరల్ వి పూరి అంకితభావంతో కూడిన పాత్ర ట్రైలర్ లో ప్రదర్శించారు. ట్రైలర్ ఈ ముగ్గురు దాయాదుల సంక్లిష్టమైన శృంగార జీవితాలు ..వారి సన్నిహిత సంబంధాలకు సంబంధించిన విషయాలతో రన్ అవుతుంది. లాడ్లీ పెళ్లికి రెడీ కాగా, అనంతరం సంక్లిష్టతలు ఏమిటన్నదే సినిమా. ట్రైలర్ హార్ట్‌బ్రేక్, పెయిన్, రొమాన్స్, ఫ్రెండ్‌షిప్, డ్రామాతో నిండిన మూడు క్లిష్టమైన ప్రేమ కథలను ఎలివేట్ చేస్తోంది. 'యారియన్ 2' ఆశించిన విజయం అందుకుంటుందా లేదా అన్నది వేచి చూడాలి.

# 'యానిమల్' క్రేజ్ తో రష్మిక పెంచేసిందా?

నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ సోషల్ మీడియా లో భారీ ఫాలోయింగ్ ఉన్న నటి. తనదైన శైలి చమత్కారలతో జనాల్ని ఆకర్షించడంలో అమ్మడి దగ్గర ఉన్న టెక్నిక్ లే మరే నటి దగ్గరా లేవంటే? అతిశయోక్తి కాదు. వెండి తెర గొప్ప పెర్ఫార్మర్ మాత్రమే కాదు అంతకు మంచి తనదైన శైలిలో ఎదుట వారిని ఆకర్షించుకోవడంలో తనదమైన ముద్ర కనిపిస్తుంది. అందుకే సోషల్ మీడియాలో అంత ఫాలోయింగ్ ఉన్న నటి అయింది. ఇక కెరీర్ పరంగా టాలీవుడ్ టూ బాలీవుడ్ దూసుకుపోతుంది. పుష్ప తో పాన్ ఇండియా క్రేజ్ ని ఆస్వాదిస్తోంది. యానిమల్ కూడా హిట్ అయితే అమ్మడి రేంజ్ టచ్ చేయని స్థాయికి రీచ్ అవుతుందని




అంచనాలున్నాయి. మరి ఈ బ్యూటీ ఒక్కో సినిమాకి ఎంత ఛార్జ్ చేస్తుంది? అంటే ఇంతవరకూ మూడు కోట్లు అని వినిపించింది. తాజాగా అమ్మడు మరో కోటి పెంచి నాలుగు కోట్లు పారితోషికంగా తీసుకుంటుందన్న విషయం లీకైంది. ఈ కోటి పెపకం అన్నది ఈ మద్యనే జరిగినట్లు తెలుస్తోంది. పుష్ప రిలీజ్ అనంతరం రష్మిక హైక్ చేస్తుందని ప్రచారం సాగిందిగానీ..అందులో క్లారిటీ లేదు. అయితే తాజాగా ఆమె అమ్మడి డైరీలో కొత్త రూల్స్ రాసిపెట్టికుందిట. దీనిలో భాగంగానే పారితోషికంలోనూ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. యానిమల్ రిలీజ్ అయి హిట్ అయితే ఆ నెంబర్ కూడా పెంచే అవకాశం ఉందిట. లేదంటే యధావిధిగా నాలుగు కోట్లు తీసుకుంటుంది. ఇక్కడ కోటి పెంచడానికి ఓ కారణం ఉంది. యానిమల్ రిలీజ్ కి ముందే ఇలా చేస్తే! ఈ గ్యాప్ లో కొన్ని ప్రాజెక్ట్ లు లాక్ చేయొచ్చు. వాటి ద్వారా తాను కోట్ చేసిన మొత్తం వస్తుంది. ఒకవేళ సినిమా అటు ఇటూ అయితే బ్యాలెన్స్ గా వెళ్లొచ్చు ! అన్నది అమ్మడి ప్లాన్ గా తెలుస్తోంది. ఇక ఎండార్స్ మెంట్స్ విషయంలో రష్మిక చాలా కాలంగా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తన దగ్గరకువచ్చిన ఏ బ్రాండింగ్ ని విడిచిపెట్టదు. వాటి ద్వారా ఎంతో కొంత ఆదాయం సమకూరుతుందని కమిట్ అవుతుది. ఆ లెక్కన చూస్తే రష్మిక మందన్న నికర విలువ 45 కోట్లు. నివేదికలప్రకారం ఎనిమిది కోట్లు వార్షిక ఆదాయంతో నెలకు 60 లక్షల వరకూ సంపాదిస్తోందని తెలుస్తోంది.

# 'దేవర' రాణి అందాల మాయ

రాబోయే బిగ్ బడ్జెట్ పాన్ ఇండియా సినిమా దేవరతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టబోతున్న జాన్వీ కపూర్ పై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. ఇప్పటివరకు బాలీవుడ్ ఇండస్ట్రీలోనే అమ్మడికి ఒక పర్ఫెక్ట్ సక్సెస్ కూడా రాలేదు. అయినప్పటికీ కూడా ఆమె గ్లామర్ తోనే తన క్రేజ్ అంతకంతకు పెంచుకుంటూనే ఉంది. ఇక ఈ మొత్తానికి జూనియర్ ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్లో రూపొందుతున్న దేవర సినిమాలో ఛాన్స్ దక్కింది. ఒక విధంగా ఇది ఆమెకు చాలా అదృష్టం అనే చెప్పాలి. ఈ సినిమా తోనే ఆమె భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుంది. ఇంత పెద్ద సినిమాతో ఆమెకు సక్సెస్ అందితే మరొక లెవెల్ కు వెళ్లే అవకాశం అయితే ఉంటుంది. ఇక అమ్మడు తన గ్లామర్ తో ఎప్పుడు కూడా ఫాలోవర్స్ కు మంచి కిక్ అయితే ఇస్తూ ఉంటుంది. రీసెంట్ గా ఆమె పోస్ట్ చేసిన మరికొన్ని



ఫోటోలు చూస్తే స్టన్ అవ్వాల్సిందే. కలర్ఫుల్ డ్రెస్లతో అమ్మడు సూర్యోదయం అలాగే సూర్యాస్తమయంలో చాలా అందమైన స్టిల్స్ అయితే ఇచ్చింది. ఈ అందాల రాణి దేవర సినిమాలో ఎ విధంగా కనిపిస్తుందా అని ఫ్యాన్స్ అయితే ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఆ మధ్య సినిమాకు సంబంధించిన స్టిల్ ను బట్టి ట్రెడిషినల్ గానే కనిపించబోతున్నట్లుగా అర్థమవుతుంది. ఇక ఈ సినిమాలను ప్రపంచవ్యాప్తంగా 2024 ఏప్రిల్ 4వ తేదీన విడుదల చేయబోతున్నారు. జాన్వీ కపూర్ చేతిలో మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా బాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె ఇంకా కరణ్ జోహార్ ప్రొడక్షన్ లోనే ఒక మరొక సినిమా అయితే చేస్తోంది. ఇప్పటివరకు దేవర సినిమా షూటింగ్లో పాల్గొనని అమ్మడు ఇక అక్టోబర్లో మొదలయ్యే షెడ్యూల్లో మాత్రం ఒక నెలపాటు బిజీ కానుంది. దేవర సినిమాలో ఆమె క్యారెక్టర్ కథకు చాలా పర్ఫెక్ట్ గా సెట్ అయినట్లుగా తెలుస్తోంది. ఇక సినిమాలో బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ పవర్ఫుల్ విలన్ గా కనిపించబోతున్నాడు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.




హైదరాబాద్: రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తమతో పొత్తు కోసం ఎన్నో విజ్ఞప్తులు వచ్చాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు. తమ బాస్ కేసీఆర్ ఎవరితోనూ పొత్తు పెట్టుకోలేదని చెప్పారు. విపక్షాలు మాత్రం కేసీఆర్‌ను ఓడించేందుకు ఒక్కటయ్యాయని విమర్శించారు.

ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. "విపక్షాలు సైద్ధాంతిక విభేదాలు పక్కన పెట్టి మరీ కలిసి పనిచేశాయి. భారాసతో కలిసి పని చేసేందుకు సిద్ధమని భాజపా చెప్పింది. 2018లోనే ఆ పార్టీ అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సంకేతాలు పంపారు. దిల్లీ బాస్‌ల అనుమతి లేకుండానే ఆయన అలా మాట్లాడారా? భాజపా ప్రతిపాదనను భారాస మరుక్షణమే తోసిపుచ్చింది. 105 స్థానాల్లో డిపాజిట్ కూడా రాని భాజపాతో భారాస ఎందుకు కలుస్తుంది? మేం పోరాడేవాళ్లమే తప్ప మోసం చేసే వాళ్లం కాదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఎన్డీయేలో భారాస చేరతామంటే తామే తిరస్కరించామంటూ నిజామాబాద్ సభలో ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి కేటీఆర్ స్పందించారు.




## ఆప్ కోసం లిక్కర్ స్కామ్ డబ్బులు.. అందుకే సంజయ్ సింగ్ ఇంట సోదాలు?

ఢిల్లీ: లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మళ్లీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో మరో ఆప్ కీలక నేత ఇంట్లో సోదాలు నిర్వహిస్తోంది. ఈ స్కామ్‌కు సంబంధించి పలువురు అప్రూవర్‌లుగా మారారనే కథనాల నడుమ.. తాజా సోదాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే ఎన్నికల్లో ఆప్ కోసం లిక్కర్ స్కామ్ డబ్బుల్నే ఉపయోగించారన్న అభియోగాలపై ఈడీ ఈ సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఆప్ ఎంపీ(రాజ్యసభ) సంజయ్ సింగ్‌కు చెందిన నార్త్ అవెన్యూ నివాసంలో బుధవారం ఉదయం ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొదటి నుంచి ఈయన ఈడీ నజర్‌లో ఉన్నప్పటికీ.. ఇప్పుడు నేరుగా నివాసాల్లో తనిఖీల దాకా వెళ్లడం గమనార్హం. ఆయన ఇంట్లో కీలక పత్రాల కోసం ఈడీ సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ఢిల్లీ వ్యాపారవేత్త దినేష్ అరోరా నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే.. దినేష్‌ను సంజయ్ సింగ్ దగ్గరుండి మాజీ మంత్రి మనీశ్‌సిసోడియాకు కలిపించాడని ఈడీ తన అభియోగాల్లో పేర్కొంది. అంతేకాదు.. లిక్కర్ డిపార్ట్‌మెంట్‌తో దినేష్ అరోరాకు ఉన్న దీర్ఘకాలిక సమస్యను ఎంపీ సంజయ్ సింగ్ పరిష్కరించారని కూడా ఆరోపించింది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో.. సంజయ్ సింగ్ పేరును మాత్రం నిందితుల జాబితాలో ఈడీ చేర్చలేదు. అయితే ఛార్జిషీట్‌లో పేరు చేర్చినప్పటికీ.. ఇప్పటిదాకా సమన్లు జారీ చేయడం గానీ, ఆయన స్టేట్‌మెంట్‌నుగానీ రికార్డు చేయలేదు. మనీశ్ సిసోడియా తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థ.. మరో ఆప్ నేత సంజయ్ సింగ్‌పై ఫోకస్ సారించింది.

ఇదిలా ఉంటే.. మాజీ డిప్యూటీ సీఎం మనీశ్‌సిసోడియాను ఈ ఏడాది ఫిబ్రవరిలో విచారణకు పిలిచి.. అటు నుంచి అటే అరెస్ట్ చేసింది సీబీఐ. అంతేకాదు ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తొమ్మిది గంటలపాటు ప్రశ్నించింది కేంద్ర దర్యాప్తు సంస్థ.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన కేటీఆర్





నిర్మల్ జిల్లా: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం నిర్మల్ జిల్లాలో పర్యటించారు. దిలావర్‌పూర్ మండలంలోని గుండంపెల్లిల వద్ద శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌తో నిర్మించిన కాళేశ్వర ప్రజెక్టు ప్యాకేజీ–27ను (శ్రీలక్ష్మీ నరసింహస్వామి లిఫ్ట్ ఇరిగేషన్) మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ఎత్తిపోతల పథకానికి స్విచ్ ఆన్ చేసి కాలువలకు నీటిని విడుదల చేసి రైతులకు అంకితం ఇచ్చారు. తరువాత దిలావర్‌పూర్ శివారులోని డెలివరీ సిస్టర్న్‌ను పరిశీలించి పూజ నిర్వహించారు. అదే విధంగా సోన్ మండలం మాదాపూర్ వద్ద రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.

**ఆశా కార్యకర్తల ఆందోళన.. గుండంపెల్లిలో ఉద్రిక్తత :** గుండంపెల్లిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. లక్ష్మీ నరసింహస్వామి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ప్రారంభానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను అడ్డుకునేందుకు ఆశా కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆశా వర్కర్లకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘర్షణలో ఓ ఆశా కార్యకర్త సొమ్మసిల్లి కిందపడిపోయారు. పోలీసుల తీరుపై ఆశా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. చివరికి ప్యాకేజీ 28 కాళేశ్వర పనులు ప్రారంభించిన తర్వాత మంత్రికి ఆశా కార్యకర్తలు వినతి పత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తామని కేటీఆర్ భరోసానిచ్చారు.

## నిజామాబాద్ సాక్షిగా మోదీ-కేసీఆర్ బంధం బయటపడింది



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "బీఆర్ఎస్–బీజేపీ ఫెవికాల్ బంధం గురించి నిజామాబాద్ సాక్షిగా మోదీ బయటపెట్టారు. బీఆర్ఎస్ అంటే బీజేపీ రిస్తేదార్ సమితి అని మా నాయకుడు రాహుల్ గాంధీ ముందే చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చి కేసీఆర్‌ను గెలిపించేందుకే మోదీ పర్యటనలు. పదేళ్లలో విభజన హామీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చే ప్రయత్నం చేయలేదు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను మోదీ అపహాస్యం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్టు చేయొద్దని కేసీఆర్ అడిగిన విషయాన్ని కూడా మోదీ చెప్పాల్సింది. బీఆర్ఎస్ ఆదేశాలతోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చారు. కేసీఆర్ అవినీతిపై ఎందుకు ఈడీ, సీబీఐ , ఐటీ విచారణ చేయడం లేదు. బీఆర్ఎస్ దోపిడీలో బీజేపీకి వాటాలు వెళుతున్నాయి. అందుకే కేసీఆర్‌పై మోదీ చర్యలు తీసుకోవడం లేదు. ఈ నిజాన్ని నిజామాబాద్ సాక్షిగా మోదీ ఒప్పుకున్నారు." అని చెప్పుకొచ్చారు. "బీఆర్ఎస్‌కు మద్దతుపై ఎంఐఎం పునరాలోచించుకోవాలి. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే... అవిభక్త కవలలు. మోదీ, కేసీఆర్‌ది ఫెవికాల్ బంధం. వారిది గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ. అలాంటి వారికి అసద్ ఎలా మద్దతు ఇస్తారు. ఎంఐఎం ఎవరివైపు నిలబడుతుంది. బీజేపీతో దోస్తీ కడుతున్న బీఆర్ఎస్‌తోనా?, బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలంటున్న కాంగ్రెస్ తోనా?." తేల్చుకోవాలని రేవంత్ సూచించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..** "నిధులు అంటే దోపిడీ సొమ్ము ... నియామకాలు అంటే కొడుకును సీఎం చేయడం గుర్తొస్తాయి. కేసీఆర్ కొల్లగొట్టిన సొమ్ములతోనే మోదీని ఆయన దర్బారులో సన్మానం చేశారు. ఇదంతా కనిపించే ఒకవైపు మాత్రమే. మరి ఎన్నికల కోసం పంపిన వేల కోట్ల సంగతి ఏంటి?, బీఆర్ఎస్ దోపిడీపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. కేసీఆర్ అధిష్టానం నరేంద్రమోదీ అని స్పష్టత వచ్చింది. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందని ఆ పార్టీ ఎంపీలే నాకు చెప్పారు. బీఆర్ఎస్–9, బీజేపీ–7, ఎంఐఎం–1 చొప్పున పంపకాలు చేసుకున్నారు. బండారం బయటపడిందనే కాంగ్రెస్‌పై బీజేపీ, బీఆర్ఎస్ ఆరోపణలు. వాళ్లిద్దరూ కాంగ్రెస్‌ను ఉమ్మడి శత్రువుగా భావిస్తున్నారు. మోదీ చెప్పింది నిజమో కాదో కేసీఆర్ చెప్పాలి." అని రేవంత్ డిమాండ్ చేశారు.

## మోదీ వ్యాఖ్యలతో.. బీఆర్ఎస్ పార్టీలో చీలికలు ఖాయం: బండి సంజయ్



కరీంనగర్: బీఆర్ఎస్ పార్టీలో త్వరలో చీలికలు ఖాయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేటీఆర్‌ను సీఎం చేయాలన్న కేసీఆర్ వ్యాఖ్యలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిర్గతం చేయడంతో బీఆర్ఎస్‌లో చీలికలు మొదలయ్యాయని అన్నారు. ఈ మేరకు కరీంనగర్‌లో బుధవారం ఎంపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ భ్రష్టు పట్టడానికి కేటీఆర్ అహంకార వైఖరి, మాటతీరే ప్రధాన కారణమని ఆరోపించారు.

**ఎన్డీయే ర్యాలీలో కేసీఆర్ పాల్గొన్నది నిజం కాదా?** గత 15 రోజుల నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి కనిపించడం లేదని, కేసీఆర్ మిస్సింగ్ తమను ఆందోళనకు గురిచేస్తోందని సెటైర్లు వేశారు. సీఎం కనిపించకపోవడానికి కొడుకు కేటీఆర్ సతాయింపే కారణమా అనేది బహిర్గతం కావాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ సభలో చేసిన మోదీ వ్యాఖ్యలపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2009లో ఎన్డీయే ర్యాలీలో కేసీఆర్ పాల్గొన్నది నిజం కాదా అని నిలదీశారు.

**అప్పుడు, ఇప్పుడూ మీ ఆస్తులెంత! :** 'ఉద్యమ సమయంలో తండ్రిని చంపేస్తారా మాకేమొస్తుందని మాట్లాడిన కేటీఆర్ ఇప్పుడు జై తెలంగాణా అని మంత్రి పదవిలో కూర్చుండు. ఇంతకంటే చీటర్ ఇంకెవరుంటారు. ఉద్యమ సమయంలో మీ ఆస్తులెంత..? ఇప్పుడు మీ ఆస్తులెంత..? తెలంగాణా సమాజం కేసీఆర్ కుటుంబం ఆస్తులు కొల్లగొడుతున్న విధానాన్ని గమనించాలి' అని బండి సంజయ్ పేర్కొన్నారు,

**మోదీ చెప్పింది అంతా నిజమే :** కేసీఆర్ కలిసిన డేట్స్‌తో సహా ప్రధాని మోదీ వెల్లడించారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇంఛార్జి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. కేసీఆర్‌తో బీజేపీ ఎప్పుడు కలవదని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని అనేకసార్లు బయటపడిందన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో జాయిన్ అవుతారని అన్నారు. ప్రధాని పర్యటనలకు రాకుండా కేసిఆర్ ప్రోటోకాల్ పక్కనే పెట్టేశాడని విమర్శించారు. మోదీ చెప్పింది అంతా నిజమేనని, కేసీఆర్ ఎన్డీయేలో కలవాలని మోదీని కలిసింది నిజం కాదా అని ప్రశ్నించారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం



మహబూబ్‌నగర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని బీజేపీ సీనియర్ నాయకురాలు డీకే అరుణ ఆరోపించారు. బుధవారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ.. "ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఇష్టానుసారం మాట్లాడితే బీఆర్ఎస్ నేతల నాలుకలకు మడత పెట్టి కుట్లేస్తాను. తెలంగాణ గడ్డ మీద కాలు పెట్టే అర్హత మోదీకి లేదనేవారు సన్యాసులు. కల్వకుంట్ల కుటుంబం కాదది.. కంత్రీ కుటుంబం. ముఖ్యమంత్రి కాదు చీటర్‌రావు. కేటీఆర్ కాదు కంత్రీ కార్యకలాపాలరావు. లోపాయికారి ఒప్పందంలో భాగంగానే ఓటుకు నోటు కేసులో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీఎం కేసీఆర్ కాపాడుతున్నారు. గెలిచినోళ్లను కూడా కాపాడుకోలేని కాంగ్రెస్.. ప్రజలకేమి గ్యారంటీ ఇస్తోంది? కవితతో ఉన్న అవినాభావ సంబంధం ఏంటో రేవంత్‌రెడ్డి చెప్పాలి? ప్రధాని ఎందుకు క్షమాపణ చెప్పాలో రేవంత్ చెప్పాలి? ప్రధానిపై బీఆర్ఎస్ నేతల చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాను. సంక్షేమ పథకాలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాను. ప్రధాని మోదీపై కేసీఆర్ కుటుంబం అహంకారపూరిత మాటలు దుర్మార్గం. కేసీఆర్.. కుటుంబానికి అన్నీ లక్షల కోట్లు ఎలా వచ్చాయి? ఒకప్పుడు సిద్దిపేట ప్రజలను మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌ది. తెలంగాణ కేసీఆర్ అబ్బ జాగీరు కాదు.. తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు లేదు. ఆత్మహత్యలకు ఉసిగొల్పి.. ఉద్యమంలో ప్రాణాలు తీసిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిది.మంత్రి కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికే.. టీఆర్ఎస్‌ను కేసీఆర్ బీఆర్ఎస్‌గా మార్చారు. తెలంగాణకు తొమ్మిదేళ్లల్లో కేంద్రం 9లక్షల కోట్ల నిధులిచ్చింది.తెలంగాణ మోడల్ అంటే.. అవినీతి మోడల్. లోపాయికారి ఒప్పందంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఆరోపణలు చేసుకుంటున్నాయి. ప్రజలను మోసం చేసి గెలుస్తామని రేవంత్‌రెడ్డి అనటాన్ని ప్రజలు గమనించాలి" అని డీకే అరుణ పేర్కొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకొస్తాం : మంత్రి హరీశ్‌రావు



కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకొచ్చి, ఇక్కడి రైతుల పాదాలను కడుగుతామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. కోస్గిలో 50 పడకల ఆస్పత్రిని మంత్రి పట్నం మహేందర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి చక్కగా పని చేస్తడలేదని ఆయనను ఓడగొట్టి.. పట్నం నరేందర్ రెడ్డిని గెలిపించుకున్నారు అని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆనాడు కొడంగల్ నియోజకవర్గంలో ఆస్పత్రి లేకుండే. ఇవాళ కోస్గిలో 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించుకున్నాం. కొడంగల్‌లో గతేడాది 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించుకున్నాం. మద్దూరులో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించాం. నేను పెద్ద నాయకుడిని అని రేవంత్ రెడ్డి అంటడు. రేవంత్ రెడ్డిని అన్ని సార్లు గెలిపిస్తే కనీసం కొడంగల్, కోస్గికి సర్కార్ దవాఖానాను తేలకపోయాడు. మీరు నరేందర్ రెడ్డిని గెలిపించారు కనుక మూడు ఆస్పత్రులను సీఎం కేసీఆర్ మంజూరు చేశారు. ఇక వైద్యం కోసం నారాయణపేట, మహబూబ్‌నగర్, తాండూరు పోవాల్సిన అవసరం లేదు. అన్ని సౌకర్యాలతో వైద్య సదుపాయాలు కల్పించాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానాకు అనేటోళ్లు.. ఇప్పుడు కేసీఆర్ నాయకత్వంలో పోదాం పదా బిడ్డ సర్కార్ దవాఖానాకు అనే అంత గొప్పగా ఆస్పత్రులను అభివృద్ధి చేశాం. పైసా ఖర్చు లేకుండా కాన్పు చేసి కేసీఆర్ కిట్ అందిస్తున్నాం. కాంగ్రెస్ గవర్నమెంట్ ఈ పని చేసిందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండించిన తలసాని



హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ చాలా బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు అరెస్ట్‌ను ఖండించారు. బుధవారం నాడు మంత్రి కార్యాలయంలో తలసాని మీడియాతో మాట్లాడుతూ..“ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడి నాయకత్వంలో మంత్రిగా పని చేశాను. చంద్రబాబు అక్రమ అరెస్ట్ వ్యక్తిగతంగా తనకెంతో బాధను కలగచేసింది. అధికారం శాశ్వతం కాదు. ఒకప్పుడు కేంద్ర రాజకీయాలల్లో చంద్రబాబు కీలకపాత్ర పోషించారు. చంద్రబాబు పట్ల వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విచారకరం. సుమారు 73 ఏళ్ల వయసులో ఉన్న చంద్రబాబుని అక్రమ అరెస్ట్ చేయడం, విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు" అని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

## కేసీఆర్ ఆఫ్ ది రికార్డ్ మాటలను మోదీ బయట పెట్టడం అనైతికం



హైదరాబాద్: ప్రధాని మోదీ వ్యాఖ్యలు దిగజారుడు తనానికి పరాకాష్ఠ అని సీపీఐ నారాయణ వ్యాఖ్యానించారు. "కేసీఆర్ ఆఫ్ ది రికార్డ్ మాటలను బయట పెట్టడం అనైతికం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటి కాదని చెప్పేందుకే మోదీ తాపత్రయం. ప్రధాని స్థాయి వ్యక్తి దేశానికి అవమానకరంగా మాట్లాడారు. కేసీఆర్ అవినీతిపై మోదీ సర్కార్ ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. లిక్కర్ స్కాంలో సిసోడియాను మాత్రమే ఎందుకు అరెస్ట్ చేశారు?, లిక్కర్ స్కాంలో ఉన్న వైసీపీ, బీఆర్ఎస్ మనుషులు సేఫ్‌గా బయట ఉన్నారు. బీఆర్ఎస్, బీజేపీది అండర్ స్టాండింగ్‌తో కూడిన ముద్దులాట, గుద్దులాట. లిక్కర్ కేసులో కవిత జైలుకు వెళ్లలేదంటే.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటి కాబట్టే. జాతీయ స్థాయి తరహాలోనే తెలంగాణలోనూ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కలిస్తే బాగుంటుంది. ఏపీలోనూ టీడీపీ, జనసేనతో కలసి పనిచేసే అంశాన్ని పరిశీలిస్తాం." అని సీపీఐ నారాయణ వ్యాఖ్యానించారు.

## ప్రధాని మోదీ వ్యాఖ్యలకు మంత్రి హరీష్‌రావు కౌంటర్



మహబూబ్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై మంత్రి హరీష్‌రావు కౌంటర్ ఇచ్చారు. బుధవారం మక్తల్ సభలో మంత్రి మాట్లాడుతూ.. మోదీ వచ్చి పెద్ద నీతులు చెప్పే ప్రయత్నం చేశారన్నారు. మోదీ ది పూటకో మాట.. రాష్ట్రానికో మాట చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అద్భుతంగా పని చేస్తున్నాడని పార్లమెంట్‌లో చెప్పారన్నారు. కేసీఆర్ ఎప్పుడు వచ్చినా నీళ్లు, ప్రాజెక్టులు, కరెంటు అభివృద్ధి గురించి మాట్లాడితే... ఏపీ నాయకుడు కేసుల గురించి మాట్లాడతారని పార్లమెంట్ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఢిల్లీలో ఒక మాట, తెలంగాణ గల్లీల్లో ఒక మాట అంటున్నారని మండిపడ్డారు. నిన్న కాక మొన్న కర్ణాటకలో దేవెగౌడ్‌తో పొత్తు పెట్టుకున్నావ్... అక్కడ ఏం చెప్తావ్ అని ప్రశ్నించారు. జ్యోతిరాదిత్య సింధియా, అనురాగ్ ఠాకూర్, పీయూష్ గోయల్ ఎవరు... సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్‌గా రాలేదు ప్రజలు లక్ష ఓట్లతో గెలిపిస్తే ప్రజాక్షేత్రం నుంచి వచ్చి పని చేస్తున్నామని తెలిపారు. "మీ మాదిరి రాజ్యసభ, మంత్రి పదవులు మాకు కేసీఆర్ ఇవ్వలేదు... ఉద్యమం చెయ్యమని చెప్పాడు. పోరాటాలు, ఉద్యమాలు, జైలుకు పోయినం. మీరు నామినేటెడ్ పదవులు ఇచ్చి కేంద్ర మంత్రి పదవులు ఇస్తున్నారు. ప్రధాన మంత్రి స్థాయికి తగ్గట్టు మాట్లాడాలి. ఎన్నికలు వస్తున్నాయని రాజకీయం కోసం మాట్లాడడం చాలా దురదృష్టకరం. కేసీఆర్ తెలంగాణ ప్రజలకు బీ టీం" అని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com